మన విశ్వం


manavishwam.com

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 72 | శుక్రవారం 28 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్

అనుబంధానికి ముడివేసే రాఖీ..
అన్నాచెల్లెళ్ల ప్రేమకు చిరునామా!

రక్షాబంధన్ సందర్భంగా అందరికీ 'మన విశ్వం' హృదయపూర్వక శుభాకాంక్షలు.

# రవాణా శాఖలో 'అవినీతి అనకొండలు'!



**జీతం వేలల్లో.. ఆస్తులు కోట్లల్లో?**

**వాహనదారుల జేబులే టార్గెట్.. ప్రతి పనికీ ఓ 'రేటు'!**

**వసూళ్లకు ప్రైవేటు అసిస్టెంట్లతో ప్రత్యేక దందా?**

**ఏసీబీ ఎప్పుడు తలుపుతడుతుందోనని కొందరు ఎంవీఐల్లో గుబులు**

**ఆస్తుల చిట్టా తీస్తే విస్తుపోయే నిజాలు బయటపడతాయంటున్న వర్గాలు**

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 27 (మన విశ్వం):** రాష్ట్ర రవాణా శాఖలో కొందరు అధికారులకు ప్రభుత్వ జీతం కంటే 'గీతమే' ప్రధాన ఆదాయంగా మారిందా? వాహనదారుల అవసరాలను అవకాశంగా మార్చుకొని అక్రమ వసూళ్లతో కోట్లకు పడగలెత్తారా? ప్రైవేటు అసిస్టెంట్లను ముందు పెట్టి లంచాల దందాను నడిపిస్తున్నారా?.. రవాణా శాఖలో కొంద రు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల వ్యవహారశైలిపై వినిపిస్తున్న ఆరోప ణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రిజిస్ట్రేషన్ నుంచి ఫిట్‌నెస్ వరకు.. పర్మిట్ నుంచి వాహన యాజమాన్య బదిలీ వరకు.. కొన్ని పనులకు 'రేట్లు' నిర్ణయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం జరగాల్సిన పనికీ చేయి తడపాల్సిందేనన్న పరిస్థితి నెలకొందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇవ్వకపోతే కొర్రీలు.. ఇస్తే చకచకా పని అన్నట్లుగా వ్యవస్థ తయారైందన్న విమర్శలున్నాయి.

**ముందు ప్రైవేటు అసిస్టెంట్..**
**వెనుక అధికారి?**

అక్రమ వసూళ్లలో కొందరు ప్రైవేటు వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు

మిగతా 2లో..

## మీరాలం.. పర్యాటక 'మణిహారం' కావాలి

- అత్యుత్తమ డిజైన్లతో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలి
- వాటర్ స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రణాళిక.. ఐలాండ్లకు సరికొత్త సొబగులు
- చెరువులోకి మురుగు చేరకుండా పకడ్బందీ చర్యలు
- సస్పెన్షన్ బ్రిడ్జి పనులను క్రేన్‌పైకి వెళ్లి పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 27 (మన విశ్వం):** చారిత్రక మీరాలం చెరువును హైదరాబాద్ పర్యాటక ముఖ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలపాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉ న్నందున దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా అత్యుత్తమ డిజైన్లు, ఆధునిక సదుపాయాలతో అభి వృద్ధి చేయాలని సూచించారు. మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనులను సీఎం మిగతా 2లో..

## హిమాలయం కూలి.. మృత్యువు పారింది!

**నేపాల్‌పై విరుచుకుపడ్డ మంచు, బురద, రాళ్ల మహాప్రవాహం**

**300 మందికి పైగా మృతి.. 2,000 మంది వరకు గల్లంతు..**

**ఊళ్లకు ఊళ్లే కనుమరుగు**

**కైలాస్ యాత్రికుల కోసం ముమ్మర గాలింపు.. గల్లంతైన వారిలో 300 మంది భారతీయులున్నట్లు సమాచారం**



**ప్రత్యేక ప్రతినిధి, ఆగస్టు 27 (మన విశ్వం):** మంచుకొండ కూలింది.. మహా ప్రవాహం పుట్టిం ది. వేల టన్నుల మంచు, మట్టి, రాళ్లు కొండలపై నుంచి దూసుకొచ్చాయి. క్షణాల్లో నదులు ఉగ్రరూ పం దాల్చి ఇళ్లు, వంతెనలు, రహదారులను తుడిచిపెట్టేశాయి. నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనదం కూలడంతో సంభవించిన ఆకస్మిక జలప్రళయం పెను విషాదాన్ని మిగిల్చింది. ఇప్పటివరకు 300 మందికి పైగా మృతి చెందగా.. 1,500 నుంచి 2,000 మంది వరకు గల్లంతైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శిథిలాల కింద మరిన్ని మృతదేహాలు ఉండొచ్చన్న అనుమానాలతో మృతుల సంఖ్య పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. బుధవారం ఉదయం 8.40గంటల సమయంలో హిమాలయాల్లో భారీ హిమనదం ఒక్కసారిగా కూ లిపోయింది. మంచుతోపాటు మిగతా 2లో..



## 'ఉత్తమ' అధికారికి ఏసీబీ షాక్!

ప్రశంసాపత్రం అందుకున్న 12 రోజులకే సోదాలు

తవ్వేకొద్దీ బయటపడుతున్న ఆస్తుల 'గని'.. డాక్యుమెంట్ విలువే రూ.3.06 కోట్లు

మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71.27 లక్షలు.. 629 గ్రాముల బంగారం

డ్రైవర్ ఖాతా నుంచి కుమార్తెకు రూ.24.80 లక్షల బదిలీ.. మూలాలపై ఏసీబీ ఆరా

వివరాలు 2లో..

## గులాబీ పగ్గాలపై 'హరీశ్' కన్ను?

**బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారంటూ సంచలన ఆరోపణ**

**మెదక్ ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు.. 'ఆ భేటీలోని ఎమ్మెల్యేనే నాకు చెప్పారు'**

**కేసీఆర్‌కు వెన్నుపోటు ప్రయత్నం.. బీజేపీతో మిలాఖత్‌కు ఆధారాలున్నాయన్న కవిత**

**రేవంత్-హరీశ్ మధ్య 'లండన్ లాలూచీ' అంటూ తీవ్ర వ్యాఖ్యలు**

**డెయిరీ వ్యవహారంపై క్విడ్‌ప్రోకో కేసు నమోదు చేయాలని సీఎంకు డిమాండ్**




**తెలంగాణ బ్యూరో , ఆగస్టు 27 (మన విశ్వం):** బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయాలపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత చేసిన తీవ్ర ఆరోపణలు రాజకీయంగా కలకలం రేపేలా ఉన్నాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్‌ను తన ఆధీనంలోకి తీసుకునేందుకు పావులు కదుపుతున్నారని, అందులో భాగంగానే మెదక్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు జరిపారని ఆమె ఆరోపించారు. అంతేకాదు.. " ఆ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఒకరే నాకు ఈ విషయాలు చెప్పారు " అంటూ వ్యాఖ్యానించారు. హరీశ్‌రావుకు బీజేపీతో మిగతా 2లో..



## జీవో 97 రద్దు చేయాల్సిందే: ఈటల

- పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు
- ప్రజాక్షేత్రానికి రావాలని సీఎంకు సవాల్
- రామచందర్‌రావు గృహనిర్బంధంపై మండిపాటు

**హైదరాబాద్, ఆగస్టు 27 (మన విశ్వం):** జీవో నంబరు 97ను వెంటనే రద్దు చేయాలని మల్కా జిగిరి ఎంపీ, భాజపా నేత ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలి టెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును మిగతా 2లో..

## చినుకు పడితే.. రోడ్డే చెరువు!

**ఎల్కతుర్తి ఎస్‌బీఐ వద్ద వర్షం వస్తే ప్రయాణం నరకమే**

**కలెక్టర్ నుంచి మండల అధికారుల వరకు సమీక్షలు.. అయినా మారని దుస్థితి**

**రోడ్డుపై నాట్లు వేసి నిరసనలు.. మంత్రి పరిశీలించినా శాశ్వత పరిష్కారం కరవు**

**అధికారుల నిర్లక్ష్యమా?.. పర్యవేక్షణ లోపమా? అంటూ స్థానికుల ప్రశ్న**



**ఎల్కతుర్తి, ఆగస్టు 27 (మన విశ్వం):** చిన్న చినుకు పడితే చాలు.. రోడ్డంతా నీటిమయం. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి. ద్విచక్ర వాహనం కాస్త అదుపు తప్పితే ప్రమాదమే! ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి చింతలపల్లి, దామెర వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ సమీపంలో నెలకొన్న దుస్థితి ఇది. ఏళ్లుగా సమస్య వెంటాడుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం దక్కడం లేదని మిగతా 2లో..

## 'ప్యాచ్'లతో సరిపెడతారా?

**మల్హర్‌లో రోడ్ల దుస్థితిపై కదిలిన ఏఎంఆర్.. మట్టి, కంకరతో తాత్కాలిక మరమ్మతులు**

**శాశ్వత రహదారులు నిర్మించాలంటున్న విపక్షాలు, ప్రజాసంఘాలు.. అధికారుల నిర్లక్ష్యంపైనా విమర్శలు**

**మల్హర్, ఆగస్టు 27 (మన విశ్వం):** మల్హర్ మండలంలో అధ్వానంగా మారిన రహదారులపై 'మన విశ్వం'లో వరుస కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. తాడిచెర్ల-కొయ్యూరు, తాడిచెర్ల-ఖమ్మంపల్లి మార్గాల్లో ఏఎంఆర్ యాజమాన్యం మట్టి, కంకరతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. అయితే గుంతలు పూడ్చి చేతులు దులుపుకొంటే సరిపోతుందా? శాశ్వత రహదారుల సంగతేం టని విపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రోడ్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ మిగతా 2లో..





## రైతుల భూములకూ 22ఏ సంకెళ్లా?

వివరాలు 2లో..

- రామదాస్‌పల్లిలో 300 ఎకరాల పట్టా
- భూములు నిషేధిత జాబితాలో: హరీశ్‌రావు
- ఆర్డీఓ నివేదిక ఉన్నా తొలగించకపోవడమేంటి?
- రెండు రోజుల్లో పరిష్కరించకుంటే రైతులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరిక

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# పని-జీవితం.. రెండూ ముఖ్యమే!

కాలం మారింది. ఉద్యోగాల తీరు మారింది. సాంకేతికత పనిని సులభం చేసింది. కానీ అదే సాంకేతికత ఉద్యోగిని కార్యాలయానికి మరింతగా కట్టిపడేస్తోంది. ఒకప్పుడు ఆఫీసు నుంచి బయటకు వచ్చాక పని ముగిసేది. ఇప్పుడు చేతిలోని మొబైల్ ఫోనే కార్యాలయంగా మారింది. సందేశాలు, మెయిళ్లు, ఆన్‌లైన్ సమావేశాలు వెంటాడుతున్నాయి. ఇంట్లో ఉన్నా.. సెలవులో ఉన్నా.. పనికి అందుబాటులో ఉండాలనే పరిస్థితి పెరుగుతోంది. ఫలితంగా పని--వ్యక్తిగత జీవితం మధ్య ఉండాల్సిన గీత చెరిగిపోతోంది.

కార్పొరేట్ రంగంలో పోటీ పెరిగేకొద్దీ ఉద్యోగులపై లక్ష్యాల ఒత్తిడీ అధికమవుతోంది. ఎనిమిది గంటల పనివేళలు కాగితాలకే పరిమితమై.. పది, పన్నెండు గంటలు పనిచేయాల్సిన పరిస్థితులు అనేక చోట్ల కనిపిస్తున్నాయి. వారాంతపు సెలవులనూ పని ఆక్రమిస్తోంది. ఎక్కువ గంటలు పనిచేస్తేనే ఎక్కువ ఫలితాలు వస్తాయనే భావన సరైంది కాదు. నిరంతర పని చివరకు అలసటను పెంచి సామర్థ్యాన్నే దెబ్బతీస్తుంది.

దీని ప్రభావం ముందుగా ఆరోగ్యంపైనే పడుతోంది. గంటల తరబడి కూర్చోవడం, వ్యాయామానికి సమయం లేకపోవడం, నిద్ర తగ్గడం, సమయపాలన లేని ఆహారం.. ఇవన్నీ శారీరక సమస్యలకు దారితీస్తున్నాయి. అంతకంటే ఆందోళనకరమైనది మానసిక ఒత్తిడి. లక్ష్యాలు, పనితీరు అంచనాలు, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి ఉద్యోగులను మానసికంగా కుంగదీస్తున్నాయి. విశ్రాంతి లేని మెదడు ఎంతకాలం సమర్థంగా పనిచేయగలదన్నది సంస్థలూ ఆలోచించాలి.

పని ఒత్తిడికి కుటుంబ సంబంధాలూ మూల్యం చెల్లిస్తున్నాయి. పిల్లలతో గడిపే సమయం తగ్గుతోంది. దంపతుల మధ్య సంభాషణలకు తీరిక ఉండటం లేదు. ఒకే ఇంట్లో ఉన్నా కుటుంబ సభ్యులు పరస్పరం సమయం కేటాయించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆదాయం పెరగడం అభివృద్ధే. కానీ అదే సమయంలో ఆరోగ్యం దెబ్బతిని, కుటుంబంలో ఆనందం తగ్గితే ఆ అభివృద్ధికి అర్థమేంటి?

ఇంటి నుంచి పనిచేసే విధానం ఈ సమస్యకు మరో కోణాన్ని జోడించింది. ప్రయాణ సమయం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. ఇల్లే కార్యాలయంగా మారడంతో పనికి ముగింపు ఎక్కడన్న స్పష్టత లేకుండా పోతోంది. రాత్రివేళ సందేశాలు, సెలవు రోజుల్లో సమావేశాలు, ఎప్పటికప్పుడు నివేదికలు కోరడం ఉద్యోగి వ్యక్తిగత సమయాన్ని హరిస్తున్నాయి. పని నుంచి పూర్తిగా దూరంగా ఉండే సమయం కూడా ఉద్యోగికి అవసరమే.

ఇక్కడ సంస్థల బాధ్యత కీలకం. ఉద్యోగుల నుంచి ఎంత పని తీసుకున్నామన్నదే కాదు.. వారు ఎంత ఆరోగ్యంగా, ఉత్సాహంగా పనిచేస్తున్నారన్నదీ యాజమాన్య విజయానికి కొలమానం కావాలి. నిర్ణీత పనివేళలు, తగిన విశ్రాంతి, అనువైన పని విధానాలు, సెలవులను గౌరవించడం, మానసిక ఆరోగ్యానికి సహాయక వ్యవస్థలు అవసరం. అలసిపోయిన ఉద్యోగితో తాత్కాలికంగా పని చేయించుకోవచ్చు. కానీ ఉత్సాహంగా ఉన్న ఉద్యోగితోనే సంస్థ దీర్ఘకాలం ఎదగగలదు.

ప్రభుత్వాలకూ బాధ్యత ఉంది. పనిగంటలు, ఉద్యోగుల సంక్షేమం, కార్యాలయ భద్రతకు సంబంధించిన నిబంధనలు సమర్థంగా అమలయ్యేలా చూడాలి. మారుతున్న ఉద్యోగ సంస్కృతికి అనుగుణంగా కార్మిక సంక్షేమంపై విస్తృత చర్చ జరగాలి. ఉద్యోగుల వ్యక్తిగత సమయాన్ని గౌరవించే పని సంస్కృతి ఏర్పడాలి.

ఉద్యోగులూ తమ ఆరోగ్యం, కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సరిపడా నిద్ర, వ్యాయామం, కుటుంబంతో సమయం, వ్యక్తిగత అభిరుచులకు కొంత తీరిక.. ఇవి విలాసాలు కావు. ఆరోగ్యకరమైన జీవితానికి అవసరాలు. ఉద్యోగంలో ఎదగాలనే లక్ష్యం ఉండాలి. కానీ ఆ ప్రయాణంలో జీవితాన్నే కోల్పోయే పరిస్థితి రాకూడదు.

దేశ ఆర్థికాభివృద్ధిని కేవలం ఉత్పత్తి, ఆదాయం, లాభాలతోనే కొలవడం సరిపోదు. ఆ అభివృద్ధిలో భాగస్వాములైన మనుషులు ఎంత ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తున్నారన్నదీ చూడాలి. పని కోసం జీవితాన్ని త్యాగం చేయడం కాదు.. మెరుగైన జీవితం కోసం పని చేయడమే అసలైన లక్ష్యం కావాలి. పని-జీవితం మధ్య సమతుల్యతే ఆధునిక అభివృద్ధికి కొత్త కొలమానం కావాలి.

*- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్*

# రవాణా శాఖలో 'అవినీతి అనకొండలు'!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. అధికారులకు నేరుగా డబ్బుతో సంబంధం కనిపించకుండా.. మధ్యవర్తులే వాహనదారులతో 'డీల్' మాట్లాడటం, మొత్తాన్ని నిర్ణయించడం, పని పూర్తయ్యేలా చూడటం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ప్రభుత్వ కార్యాలయంలో ఈ ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

**జీతంతోనే కోట్ల ఆస్తులా?**

కొందరు అధికారుల జీవనశైలి, ఆస్తులపై శాఖలోనే ఆసక్తికర చర్చ సాగుతోంది. వారి అధికారిక ఆదాయం ఎంత? విధుల్లో చేరినప్పుడు ఆస్తులెన్ని? ప్రస్తుతం వారి పేరుతో, కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లతో ఉన్న స్థిర, చరాస్తుల విలువ ఎంత? అనే అంశాలపై లోతైన విచారణ జరిగితే అసలు లెక్కలు బయటపడతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**'ఏసీబీ' పేరు వింటేనే గుబులు?**

అవినీతి అధికారులపై ఏసీబీ వరుస దాడుల నేపథ్యంలో కొందరు ఎంవీఐల్లో గుబులు మొదలైందనే ప్రచారం సాగుతోంది. ఎప్పుడు ఎవరి కార్యాలయం, ఇంటిపై నిఘా పడుతుందోనన్న ఆందోళన నెలకొందని శాఖలో చర్చ జరుగుతోంది. అక్రమ ఆస్తులు, మధ్యవర్తుల లావాదేవీలు, ప్రైవేటు అసిస్టెంట్ల వ్యవహారాలపై ఏసీబీ దృష్టి సారిస్తే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని వర్గాలు పేర్కొంటున్నాయి.

**నిఘా పెడితే.. 'అనకొండల' బండారం బయటకే!**

కేవలం కార్యాలయాల్లో జరిగే లావాదేవీలే కాకుండా.. కొందరు అధికారుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, మధ్యవర్తుల పాత్రపై సమగ్ర నిఘా అవసరమనే డిమాండ్ వినిపిస్తోంది. వాహనదారుల నుంచి అక్రమంగా ఒక్క రూపాయి వసూలు చేసినా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రవాణా శాఖలో కొంతమంది అవినీతి అనకొండలు సుమారుగా ఎన్ని ఉన్నాయి.. వాటి వెనుకున్న ఎవరెవరున్నారు?.. ఏసీబీ నిఘా పడితేనే అసలు బాగోతం తేలనుంది.

# గులాబీ పగ్గాలపై 'హరీశ్' కన్ను?

(మొదటిపేజీ తరువాయి)

మిలాఖత్ ఉందని చెప్పేందుకు తన వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

**కేసీఆర్‌కు వెన్నుపోటు ప్రయత్నమా?**

బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా హరీశ్‌రావు వ్యూహాలు రచిస్తున్నారని కవిత ఆరోపించారు. మెదక్ ఎమ్మెల్యేలతో ఇటీవల ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ అధినేత కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను చేస్తున్న ఆరోపణలు ఊహాజనితం కాదని, బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే నుంచే తనకు సమాచారం వచ్చిందని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

**'గుంపు మేస్త్రి-గుంటనక్క మధ్య లాలూచీ'**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావులపైనా కవిత తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఇద్దరి మధ్య లండన్‌లోనే రాజకీయ అవగాహన కుదిరిందన్న అర్థంలో ' గుంపు మేస్త్రి -గుంట నక్క మధ్య లాలూచీ ' అంటూ వ్యాఖ్యానించారు. అలాంటి ఒప్పందమేదీ లేకపోతే హరీశ్‌రావుపై వస్తున్న ఆరోపణల విషయంలో ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

**'డెయిరీ వ్యవహారంపై కేసు పెట్టండి'**

గత ప్రభుత్వంలో హరీశ్‌రావు వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తన కుటుంబానికి సంబంధించిన డెయిరీకి లబ్ధి చేకూరేలా వ్యవహరించారని కవిత ఆరోపించారు. ప్రభుత్వ రంగ డెయిరీలను కాదని ప్రైవేటు డెయిరీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులు, కళాశాలలు, ఇతర సంస్థలకు పాలు సరఫరా చేసి ఎనిమిదేళ్లలో వందల కోట్ల రూపాయల వ్యాపారం చేశారంటూ ఆరోపణలు చేశారు." అధికారాన్ని ఉపయోగించి సొంత వ్యాపారానికి ప్రయోజనం చేకూర్చడం క్విడ్ ప్రొకో కాదా? " అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఆరోపణలపై విచారణ జరిపించి, ఆధారాలు ఉంటే హరీశ్‌రావుపై క్విడ్‌ప్రోకో కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావుతో ఎలాంటి లాలూచీ లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉందన్నారు. అలాగే 500 మందికి పైగా విద్యార్థులున్న విద్యాసంస్థలకు ప్రైవేటు డెయిరీల నుంచి కాకుండా ప్రభుత్వ లేదా సహకార సంఘాల ఆధ్వర్యంలోని డెయిరీల నుంచే పాలు సరఫరా చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకత్వంపై ఆరోపణలు, బీజేపీతో మిలాఖత్ వ్యాఖ్యలు, రేవంత్--హరీశ్ మధ్య 'లాలూచీ' ఉందన్న విమర్శలు, డెయిరీ వ్యవహారంపై క్విడ్‌ప్రోకో కేసు డిమాండ్.. ఇలా ఒకేసారి పలు రాజకీయ అస్త్రాలను కవిత సంధించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. అయితే ఆమె చేసిన ఆరోపణలపై హరీశ్‌రావు లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

# హిమాలయం కూలి.. మృత్యువు పారింది!

(మొదటిపేజీ తరువాయి)

రాళ్లు, మట్టి భారీగా లోయల్లోకి దూసుకురావడంతో భోటే కోషి, త్రిశూలీ నదుల్లో ప్రవాహం అమాంతం పెరిగింది. ఉప్పొంగిన నీరు దిగువ ప్రాంతాలపై విరుచుకుపడింది. తొలుత భూకంపం సంభవించినట్లు భావించినా.. హిమనదం కూలడంతో ఏర్పడిన భారీ శిథిల ప్రవాహమే విధ్వంసానికి కారణమని అనంతరం గుర్తించారు.

**ఊళ్లే కనుమరుగు**

రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో విధ్వంసం తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో ఇళ్లు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయి. కనీసం 19 వంతెనలు ధ్వంసమవగా, 40 కిలోమీటర్లకు పైగా రహదారులు దెబ్బతిన్నట్లు సమాచారం. జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతినడంతో అనేక ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లాయి. సమాచార వ్యవస్థ స్తంభించడంతో కొన్ని గ్రామాలతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

**యాత్రికుల జాడ కోసం..**

గల్లంతైన వారిలో కైలాస్ మానససరోవర్ యాత్రికులు, విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. భారతీయులతోపాటు పలు దేశాల పౌరుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. దాదాపు 300 మంది భారతీయుల జాడ తెలియడం లేదన్న సమాచారంతో భారత విదేశాంగ శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

**శిథిలాల్లో ప్రాణాల కోసం పోరాటం**

నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్లతో రంగంలోకి దిగాయి. వరదల్లో చిక్కుకున్న వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శిథిలాల కింద ప్రాణాలతో ఎవరైనా ఉన్నారా అన్న ఆశతో గాలింపు కొనసాగుతోంది. పేరుకుపోయిన బురద, తెగిపోయిన రహదారులు, ప్రతికూల వాతావరణం సహాయక చర్యలకు సవాల్‌గా మారాయి. విపత్తు ప్రభావం సరిహద్దు అవతల టిబెట్‌పైనా పడింది.

**ఇంకా ముప్పు తొలగలేదు**

హిమనదం కూలిన ప్రాంతంలో భారీగా పేరుకుపోయిన మట్టి, రాళ్లు నదీ ప్రవాహాన్ని అడ్డుకుంటున్నట్లు నిపుణులు గుర్తించారు. ఆ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగితే మరో భారీ వరద దిగువ ప్రాంతాలపై విరుచుకుపడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. దీంతో ముప్పున్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. హిమాలయాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేగంగా కరుగుతున్న హిమానీనదాలు, అసాధారణ వర్షపాతం భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల తీవ్రతను పెంచవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒకవైపు గల్లంతైన వారి కోసం ఎదురుచూపులు.. మరోవైపు శిథిలాల్లో ప్రాణాల కోసం అన్వేషణ.. నేపాల్‌ను మహావిషాదంలో ముంచేశాయి.

# చినుకు పడితే.. రోడ్డే చెరువు!

(మొదటిపేజీ తరువాయి)

స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్కతుర్తి నుంచి చింతలపల్లి, దామెరతోపాటు పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రహదారి కీల కం. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎస్‌బీఐ సమీపంలో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రహదారి చెరువును తలపిస్తోంది. నీటిలో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. పాదచారుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.

**నాట్లు వేసినా.. కదలని యంత్రాంగం!**

ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా రు. రాజకీయ పార్టీల నాయకులు సైతం రోడ్డుపై నాట్లు వేసి నిరసన లు తెలిపారు. సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వ త చర్యలు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేయడంతో మరో వర్షానికి పరిస్థితి మళ్లీ మొదటికొస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

**సమీక్షలెన్నో.. పరిష్కారం సున్నా!**

జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి మండలంలోని వివిధ శాఖల అధికారుల వరకు ఈ సమస్యపై సమీక్షలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మంత్రి సైతం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అయినా రహదారిపై నీరు నిలవకుండా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయడం, రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం మాత్రం కార్యరూపం దాల్చలేదు." కలెక్టర్ సమీక్షించారు.. అధికారులు చూశారు.. మంత్రి పరిశీలించారు.. నిరసనలు చేశాం.. అయినా మా రోడ్డు ఎందుకు మారడం లేదు? " అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**నిర్లక్ష్యమా?.. పర్యవేక్షణ లోపమా?**

పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంపై స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారుల నిర్లక్ష్యమా? ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపమా? మండల స్థాయిలో సమన్వయం కొరవడిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సమీక్షలు, పరిశీలనలు, తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సమస్య మూలాన్ని గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఎస్‌బీఐ సమీపంలో వర్షపు నీరు నిలవకుండా పటిష్ఠమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతోపాటు రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎల్కతుర్తి-చింతలపల్లి, ఎల్కతుర్తి-దామెర మార్గాల్లో ప్రయాణించే ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో స్పందించి 'చినుకు పడితే చేరువయ్యే రోడ్డుకు' శాశ్వత పరిష్కారం చూపాలని 'స్థానికులు కోరుతున్నారు.

# 'ప్యాచ్'లతో సరిపెడతారా?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. తాడిచెర్ల నుంచి కొయ్యూరు, ఖమ్మంపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారులు పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏఎంఆర్ ప్రాజెక్టుకు సంబంధించిన భారీ వాహనాలతోపాటు బొగ్గు, ఇసుక లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

భారీ వాహనాల రాకపోకల కారణంగా రహదారులు దెబ్బతింటున్నా సంబంధిత అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని విపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఏఎంఆర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**మట్టి పోస్తే సమస్య తీరుతుందా?**

గుంతల్లో మట్టి, కంకర వేసి తాత్కాలికంగా సరిచేయడం పరిష్కారం కాదని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి. వర్షాలు కురిస్తే మట్టి బురదగా మారి వాహనదారులకు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని చెబుతున్నారు. తాడిచెర్ల-కొయ్యూరు, తాడిచెర్ల-ఖమ్మంపల్లి మార్గాల్లో నాణ్యమైన బీటీ లేదా సీసీ రహదారులు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం లేకుంటే ఆందోళన**

రోడ్ల సమస్యను ప్రభుత్వం, అధికారులు, ఏఎంఆర్ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని విపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమస్యను పట్టించుకోకుంటే రోడ్ల దిగ్బంధం సహా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# మీరాలం.. పర్యాటక 'మణిహారం' కావాలి

(మొదటిపేజీ తరువాయి)

గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి ప్రణాళికలు, ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను సీఎం పరిశీలించారు. అధికారులు ప్రాజెక్టు వివరాలను ఆయనకు వివరించారు. ప్రతిపాదిత డిజైన్లను పరిశీలించిన సీఎం.. పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్టును తీర్చిదిద్దాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఓపెన్ టాప్ జీపులో చుట్టూ పరిశీలన**

చెరువు చుట్టూ చేపడుతున్న అభివృద్ధి పనులను సీఎం ఓపెన్ టాప్ జీపులో ప్రయాణిస్తూ పరిశీలించారు. అనంతరం మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనులను భారీ క్రేన్ సహాయంతో పైకి వెళ్లి స్వయంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, డిజైన్, పర్యాటకులకు అందుబాటులోకి రానున్న సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**వాటర్ స్పోర్ట్స్.. ఐలాండ్లకు కొత్త సొబగులు**

మీరాలం చెరువును కేవలం విహార కేంద్రంగా కాకుండా ప్రత్యేక పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. పర్యాటకుల కోసం వాటర్ స్పోర్ట్స్‌కు అనువైన డిజైన్లు రూపొందించాలని, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండటాన్ని ప్రయోజనంగా మలుచుకుని పరిసర ప్రాంతాన్నంతా పర్యాటకులకు ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయాలని చెప్పారు.

**మురుగు చేరకుండా అడ్డుకట్ట**

చెరువు సుందరీకరణతోపాటు నీటి నాణ్యత పరిరక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో మీరాలం నుంచి మూసీలోకి నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాను విస్తరించాలని సూచించారు.

# 'ఉత్తమ' అధికారికి ఏసీబీ షాక్!

భూపాలపల్లి, ఆగస్టు 27 (మన విశ్వం): ఆగస్టు 15న 'ఉత్తమ అధికారి'గా ప్రశంసాపత్రం అందుకున్నారు.. సరిగ్గా 12 రోజులు తిరిగేసరికి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు ఎదుర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గనులు, భూగర్భశాస్త్ర శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొజ్జ జయరాజ్‌కు సంబంధించి ఏసీబీ తనిఖీల్లో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఇప్పటివరకు గుర్తించిన వాటి డాక్యుమెంట్ విలువనే రూ.3.06 కోట్లుగా అధికారులు లెక్కించారు. మార్కెట్ ధరల ప్రకారం వాటి విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని భావిస్తున్నారు. జయరాజ్ ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూనే వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఆయనతోపాటు బంధువులు, సన్నిహితులకు సంబంధించిన ఎనిమిది ప్రాంతాల్లో వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు.

**ఇళ్లు.. ప్లాట్లు.. భూములు..**

సోదాల్లో హైదరాబాద్ బోడుప్పల్‌లో జీ౦2 భవనం, కేపీహెచ్‌బీలో ఓ ఫ్లాట్‌ను గుర్తించారు. కేసర, తూంగతుర్తి, తూప్రాన్, సూర్యాపేట ప్రాంతాల్లో ఐదు ప్లాట్లు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు ఏసీబీ వెల్లడించింది. వీటితోపాటు రూ.10.03 లక్షల నగదు, 629 గ్రాముల బంగారం లభించినట్లు తెలిపింది. మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71.27 లక్షల నిల్వలతోపాటు బీమా పాలసీలు, పోస్టాఫీసు పొదుపులను గుర్తించారు. మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను సైతం ఆస్తుల జాబితాలో చేర్చారు. ఇప్పటివరకు గుర్తించిన మొత్తం ఆస్తుల విలువను రూ.3,06,53,177గా ఏసీబీ లెక్కించింది.

**డ్రైవర్ ఖాతా నుంచి రూ.24.80 లక్షలు!**

దర్యాప్తులో వెలుగుచూసిన ఓ ఆర్థిక లావాదేవీపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టిసారించింది. జయరాజ్ డ్రైవర్ సత్తునూరి యాదయ్య బ్యాంకు ఖాతా నుంచి జయరాజ్ కుమార్తె ఖాతాకు పలు విడతల్లో రూ.24.80లక్షలు బదిలీ అయినట్లు ప్రాథమికంగా గుర్తించింది. ఇసుక రవాణాతో సంబంధమున్న వ్యక్తుల నుంచి వచ్చిన సొమ్మును కుమార్తె ఖాతాకు పంపినట్లు డ్రైవర్ విచారణలో పేర్కొన్నారని అధికారులు తెలిపారు. ఆ నగదు అసలు ఎక్కడి నుంచి వచ్చింది? ఎందుకు కుమార్తె ఖాతాకు మళ్లించారు? ఈ లావాదేవీల వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో ఆరా తీస్తున్నారు.

**12 రోజుల్లోనే మారిన సీన్**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న జయరాజ్ 'ఉత్తమ అధికారి'గా ఎంపికై ప్రశంసాపత్రం అందుకోవడం.. ఆ తర్వాత కేవలం 12 రోజులకే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. ఓవైపు ఉత్తమ అధికారిగా ప్రశంసలు అందుకోగా.. మరోవైపు భారీ ఆస్తులపై ఏసీబీ దర్యాప్తు సాగుతుండటం గమనార్హం. మరిన్ని ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, నగదు బదిలీలకు సంబంధించిన వివరాలపై ఏసీబీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

# రైతుల భూములకూ 22ఏ సంకెళ్లా?

**రామదాస్‌పల్లిలో 300ఎకరాల పట్టా.. భూములు నిషేధిత జాబితాలో: హరీశ్‌రావు**

హైదరాబాద్, ఆగస్టు 27 (మన విశ్వం): ఇబ్రహీంపట్నం పరిధిలోని రామదాస్‌పల్లిలో 300 ఎకరాలకు పైగా రైతుల పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతుల భూములనూ నిషేధిత జాబితాలో పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించారు. కమిషన్ల కోసమే రైతుల భూములను బందీ చేస్తున్నారా? అని ధ్వజమెత్తారు. రైతుల వ్యవసాయ భూములతోపాటు మూడు లేఅవుట్లలోని స్థలాలు, బాండెడ్ లేబర్‌కు కేటాయించిన భూములనూ 22ఏలో చేర్చారని హరీశ్‌రావు ఆరోపించారు. దీంతో రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు అందక బాధితులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూరియా పొందడంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి మొరపెట్టుకున్నా పరిష్కారం లభించలేదన్నారు. కలెక్టర్, తహసీల్దార్ సహా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిస్థితి మారలేదని విమర్శించారు. ఆ భూములు రైతులవేనని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ నోట్ రిపోర్టు ఇచ్చినప్పటికీ 22ఏ నుంచి ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. "కొత్తగా ఒక్క ఎకరాన్నీ 22ఏలో చేర్చలేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చెబుతున్నారు. మరి రామదాస్‌పల్లి రైతుల భూములు అందులోకి ఎలా వచ్చాయి? 98 శాతం దరఖాస్తులు పరిష్కరించామని ప్రభుత్వం చెబుతోంది. ఈ రైతుల సమస్యకు ఏం సమాధానం చెబుతుంది?" అని హరీశ్‌రావు నిలదీశారు. ప్రతిపక్ష నాయకుల కదలికలపైనే కాకుండా ప్రజల సమస్యలపైనా ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు తెప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. రామదాస్‌పల్లి భూములపై వెంటనే నివేదిక తెప్పించి రైతుల పట్టా భూములను 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే బీఆర్ఎస్ బృందం రామదాస్‌పల్లికి వెళ్లి రైతులకు న్యాయం జరిగే వరకు ధర్నా చేపడుతుందని హెచ్చరించారు.

# జీవో 97 రద్దు చేయాల్సిందే: ఈటల

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బతీసే నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. జీవోను ఉపసంహరించుకోకపో తే జరిగే పరిణామాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో గురువారం ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన ఎంతోమంది నేరుగా ఉపాధి అవకాశాలు పొందుతున్నారని, మరికొందరు ఉన్నత విద్యకు వెళ్తున్నారని పేర్కొన్నారు. అలాంటి విద్యావ్యవస్థలో మార్పులు చేస్తూ విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని, తల్లిదండ్రుల్లోనూ ఆందోళన నెలకొందన్నారు. "రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా ప్రభుత్వంపై అసంతృప్తే వ్యక్తమవుతోంది. ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని సీఎం అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు ప్రజల మద్దతు ఉందని భావిస్తే ప్రజాక్షేత్రానికి రావాలి" అని ఈటల సవాల్ చేశారు. 1965 నుంచి ఉన్న ఆర్.కె.పురం కాలనీని 22ఏ పరిధిలోకి తీసుకురావడంపైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పోలీసులతో అణచివేయాలని చూస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, నాయకులు మహిపాల్, మల్క యశస్వి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పర్యవేక్షణపై కలెక్టర్ ఆదేశాలు

- విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడాలని హెచ్చరిక
- ఎఫ్ఎల్ఎన్, అభ్యసన ఫలితాలపై సమీక్ష
- ఆగస్టు 31లోగా యూనిఫాంల పంపిణీ పూర్తి చేయాలి

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 27 (మన విశ్వం):** జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు విద్యాశాఖ అధికారులు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ అక్కడి కార్యకలాపాలను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం తన చాంబర్ నుంచి అన్ని మండలాల ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వెబ్ సమావేశంలో విద్యారంగ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పదేపదే సమీక్షలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్ ఆన్‌బోర్డింగ్, విద్యార్థుల నమోదు, డ్రాప్‌బాక్స్ పెండింగ్ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 87 ఎఫ్ఎల్ఎన్ కాంపొనెంట్ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలను విద్యార్థుల వారీగా



నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన బేస్‌లైన్ అసెస్‌మెంట్ ఫలితాలను సబ్జెక్టుల వారీగా విశ్లేషించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని చెప్పారు.
ప్రతి విద్యార్థి ఏ అంశంలో వెనుకబడి ఉన్నాడో గుర్తించి మూడు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట రెమిడియల్ తరగతులు, అదనపు బోధన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను లక్ష్య స్థాయికి తీసుకురావాలని చెప్పారు. అభ్యసన ఫలితాల మెరుగుదలపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్న కలెక్టర్, ఇంకా సుమారు ఆరు వేల మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని తెలిపారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కొత్త విద్యార్థుల నమోదును పెంచాలని సూచించారు. గ్రామాలు, కాలనీల స్థాయిలో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని చెప్పారు .పాఠశాలల సందర్శనలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణలో ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పాత్ర మరింత చురుకుగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల పేరు, హోదా, బోధించే సబ్జెక్టు, విద్యార్హతలు, వృత్తిపరమైన అర్హతలు, ప్రత్యేక శిక్షణలు తదితర వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా గూగుల్ ఫారమ్‌లలో నమోదైన వివరాలు ఉండేలా పరిశీలించాలని సూచించారు. పూర్తయిన యూనిఫాంలను ఈ నెల 31లోగా విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిగిలిన యూనిఫాంల పంపిణీకి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయుల పనితీరు రాబోయే రోజుల్లో గణనీయంగా మెరుగుపడాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- మంతూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠకు హాజరు
- గౌడుగుపల్లిలో ముత్యాలమ్మ మహోత్సవంలో ప్రత్యేక పూజలు
- ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- నియోజకవర్గ ప్రజలకు శుభాశీస్సులు కోరిన ఎమ్మెల్యే

**సిద్దిపేట, ఆగస్టు 27 (మన విశ్వం):** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంతూర్ గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఎమ్మెల్యే దేవతలను




ప్రార్థించారు. కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.
అనంతరం దౌల్తాబాద్ మండలం గౌడుగుపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ ముత్యాలమ్మ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ--ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కూడా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. దేవాలయాలు సామాజిక, సాంస్కృతిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణ కూడా ఎంతో ముఖ్యమని చెప్పారు.శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు దుబ్బాక నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమాలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి.

# 22-ఏ భూముల వివరాలు సమర్పించాలి

- వ్యవసాయ, వ్యవసాయేతర భూముల గుర్తింపునకు ఆదేశాలు
- భూభారతి పోర్టల్‌లోనే సమస్యల పరిష్కారం
- ప్రతి మండలంలో ఒక గ్రామంలో రీ సర్వే
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెంచాలి

**జనగామ, ఆగస్టు 27 (మన విశ్వం):** 22-ఏ కింద నమోదైన వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి వాటి పూర్తి వివరాలను నిర్ణీత నమూనాలో సేకరించి వెంటనే సమర్పించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూభారతి, 22-ఏ నమోదులు, సమగ్ర రీ సర్వే అంశాలపై గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. భూ రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి సూచించారు.




భూభారతి డేటా ఆధారంగా 22-ఏ నమోదుల్లో ఎక్కడైనా విస్తీర్ణ వ్యత్యాసాలు కనిపిస్తే వాటిని భూభారతి పోర్టల్‌లోనే పరిష్కరించాలని లోకేష్ కుమార్ తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22-ఏ కింద నమోదైన వాటిని గుర్తించి తహసీల్దార్ల ద్వారా వివరాలు సేకరించి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అందుతున్న ఫిర్యాదులను అదే రోజు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ సమగ్ర భూ రీ సర్వే నిర్వహించాలని, ఆ ఫలితాల ఆధారంగా జిల్లాలోని ఇతర గ్రామాలకు కూడా రీ సర్వే విస్తరించాలని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహి ంచారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 22-ఏ కింద నమోదైన వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో రీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన సర్వేయర్లను నియమించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూభారతి పోర్టల్‌లో ఉన్న సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా సవరణ, అర్బన్ ల్యాండ్, జీపీపీ, పీపీబీ, నాలా తదితర మాడ్యూల్స్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ మన్యంకొండ, డీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలి

- బర్ధిపూర్‌లో రీ సర్వే పనుల పరిశీలన
- భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మక కార్యక్రమం
- ఆధునిక సాంకేతికతతో సర్వే నిర్వహణ
- మొదటి విడతలో 70 గ్రామాల ఎంపిక

**జగిత్యాల, ఆగస్టు 27 (మన విశ్వం):** జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీ సర్వే కార్యక్రమంలో భాగంగా బర్ధిపూర్ గ్రామంలో జరుగుతున్న నాన్ కెడస్ట్రాల్, ఎంజాయ్మెంట్ సర్వే పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాల పనితీరు, భూముల కొలతల ప్రక్రియ, ఆధునిక పరికరాల వినియోగాన్ని కలెక్టర్ పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వంతో పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల నవీకరణలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు.
భూ వివాదాలు, యాజమాన్య సమస్యల పరిష్కారానికి రీ సర్వే కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాల సహాయంతో సర్వే చేపట్టడం ద్వారా భూముల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయవచ్చన్నారు. రైతులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ముందుగా గ్రామ సరిహద్దులను గుర్తించి, అనంతరం రైతుల వారీగా భూముల కొలతలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి దశలో



ప్రజలకు పూర్తి సమాచారం అందిస్తూ పారదర్శకంగా కార్యక్రమాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. రైతుల అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను రీ సర్వే కోసం ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపికైన గ్రామాల్లో సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సర్వే ఫలితాలు భూ రికార్డుల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో రెవెన్యూ అధికారులు, సర్వే బృందాలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్వరలో కార్మిక సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే హరీష్ బాబు

**కొమురం భీం, ఆగస్టు 27( మన విశ్వం ):** సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పేపర్ మిల్ కార్మిక సంఘాల ఫోరం నాయకులు సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. హరీష్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, వేతన సవరణ ఒప్పందం, కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు.కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే డా. హరీష్ బాబు సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వేతన సవరణ ఒప్పందం, కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు, కార్మిక శాఖ మంత్రితో చర్చించి కార్మికులకు



న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. మేనేజ్‌మెంట్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్మికుల న్యాయం, సంక్షేమం దిశగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై కార్మిక సంఘాల ఫోరం నాయకులు, కార్మికులు కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# బెజ్జూర్‌లో నిషేధిత గడ్డి మందు పట్టివేత: ఇద్దరిపై కేసు నమోదు



**కొమరం భీం/బెజ్జూర్, ఆగస్టు 27(మన విశ్వం):** మహారాష్ట్ర నుంచి అక్రమంగా నిషేధిత గడ్డి మందును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బెజ్జూర్ పోలీసులు గురువారం ఉదయం పట్టుకున్నారు.సులుగుపల్లి గ్రామానికి చెందిన బోర్కుట్ పురుషోత్తం, డేటి సుధాకర్ మహారాష్ట్రలోని అహేరి ప్రాంతంలో నిషేధిత గడ్డి మందును కొనుగోలు చేశారు. స్థానిక రైతులకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో, 20 లీటర్ల సామర్థ్యం గల రెండు క్యాన్లలో ఈ మందును స్కూటీపై తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం 6:00 గంటల ప్రాంతంలో కృష్ణపల్లి బ్రిడ్జి వద్ద నిఘా ఉంచి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి ?40 లీటర్ల నిషేధిత గడ్డి మందు 20 లీటర్ల రెండు క్యాన్లు,?ఒక స్కూటీ,?రెండు మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకొని ?నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత పురుగుమందులు, నకిలీ వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసినా లేదా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# చేయూత పెన్షన్‌కు 31 వరకే గడువు




- అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కె.హరిత

**కొమరం భీం, ఆగస్టు 27 (మన విశ్వం):** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేయనున్న చేయూత పెన్షన్లకు అర్హులైన వారు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మారుమూల గ్రామాల్లోని అర్హులకు సైతం సమాచారం చేరేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు తదితరులతో కలిసి చేయూత పెన్షన్లకు సంబంధించిన గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 31 చివరి తేదీ అని తెలిపారు. అర్హులెవరూ గడువు దాటిపోవడంతో అవకాశాన్ని కోల్పోకుండా గ్రామస్థాయి వరకు ప్రచారం చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శశిధర్, ఏపీఓ (పెన్షన్) రామకృష్ణ, ఏపీఓ ధన్‌రాజ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కారు ఢీకొని రైతు మృతి

- దస్రుతండా కొమ్మాల స్టేజీ మధ్య ఘోర ప్రమాదం

**గీసుగొండ, ఆగస్టు 27 (మన విశ్వం):** వరంగల్--నర్సంపేట ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందారు. సంగెం మండలం వంజరపల్లి గ్రామానికి చెందిన గోనె సమ్మయ్య (70) వ్యవసాయ పనిముట్లకు వెల్డింగ్ చేయించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దస్రుతండా--కొమ్మాల స్టేజీ మధ్య కారు ఢీకొట్టింది.
పోలీసుల వివరాల ప్రకారం.. సమ్మయ్య మధ్యాహ్నం తన టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై కొమ్మాల వైపు బయలుదేరారు. సుమారు 3.30 గంటల సమయంలో ఎదురుగా వచ్చిన స్విఫ్ట్



డిజైర్ కారు ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు సమ్మయ్య వాహనంతో పాటు కొంతదూరం ఈడ్చుకెళ్లారు. తలతోపాటు శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.
మృతుడి భార్య గోనె సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వనం ప్రమోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ తెలిపారు.

# యూరిక్ యాసిడ్‌ను తగ్గించే ఈ ఐదు పానీయాల గురించి మీకు తెలుసా..?



యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ సమస్యతో బాధపడే వారు మందులపై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం లేదు. ఇంట్లో సులభంగా లభించే ఆహార పదార్థాలతో తయారుచేసే కొన్ని పానీయాలు సహజంగా యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. శరీరంలో ప్యూరిన్‌లు విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ తయారవుతుంది. ఇది మూత్రపిండాల ద్వారా బయటకు పోతుంది. కానీ యూరిక్ యాసిడ్ ఎక్కువైతే కీళ్లలో చిన్న స్ఫటికాలు ఏర్పడి నొప్పి, వాపు కలిగిస్తాయి. యూరిక్ యాసిడ్ స్థాయి ఎక్కువైతే గౌట్ సమస్య వస్తుంది. కీళ్లలో నొప్పి, వాపు, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. యూరిక్ యాసిడ్‌ను తగ్గించే ఆ ఐదు పానీయాలు ఏవో తెలుసుకుందాం..నీరు : రోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగడం చాలా మంచిది. ఇది శరీరంలో ఉన్న యూరిక్ పంపడంలో సహాయపడుతుంది.

# మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి భూమిపూజ






**ఎల్కతుర్తి,ఆగస్టు 27(మన విశ్వం):** మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి గురువారం చింతలపల్లి గ్రామంలో భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘాల కోసం ప్రత్యేక భవనం నిర్మించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చింతలపల్లి గ్రామ సర్పంచ్ బొంకూరి రజిత, ఉపసర్పంచ్ దాసరి రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ సుకిన్ హేమతో పాటు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సీఏలు, వీవోలు, వివిధ మహిళా సంఘాల గ్రూపులకు చెందిన సభ్యులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతన భవనం నిర్మాణం ద్వారా గ్రామంలోని మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, వివిధ కార్యక్రమాలను సమన్వయం చేసుకోవడానికి అనుకూలమైన వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా కొనసాగుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.భూమిపూజ అనంతరం మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తయి మహిళలకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు భవన నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళలు అప్పర్ బాడీ కండరాలు బలంగా మారాలంటే ఏం చేయాలి..



బలమైన అప్పర్ బాడీ కండరాలు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. రోజువారీ జీవితంలో వస్తువులను ఎత్తడం, తోయడం, లాగడం, మోయడం వంటి పనులు సులభంగా చేయడానికి ఇవి సహాయపడతాయి. అంతేకాకుండా మంచి శరీర భంగిమను కొనసాగించడంలో, వెన్నునొప్పి, గాయాల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా అప్పర్ బాడీ బలం కీలక పాత్ర పోషిస్తుంది. అయితే పురుషులతో పోలిస్తే మహిళల్లో పైభాగంలో కండరాల పరిమాణం సాధారణంగా తక్కువగా ఉండటం వల్ల వారికి అప్పర్ బాడీ వ్యాయామాలు కొంత కష్టంగా అనిపిస్తాయి. మహిళల్లో మొత్తం కండరాల పరిమాణం సగటున పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. అలాగే మహిళల శరీరంలో కండరాల పంపిణీ కూడా భిన్నంగా ఉంటుంది. పైభాగంతో పోలిస్తే కాళ్లు, తొడలు వంటి దిగువ భాగంలో ఎక్కువ కండర ద్రవ్యరాశి ఉండే అవకాశం ఉంటుంది. సాధారణంగా మహిళల్లో పురుషులతో పోలిస్తే అప్పర్ బాడీ కండరాల పరిమాణం సుమారు 40 శాతం తక్కువగా ఉంటుందని ఈ వివరాలు సూచిస్తున్నాయి.ఛాతీ, భుజాలు, చేతులు వంటి ప్రాంతాల్లో మహిళల కండరాల క్రాస్–సెక్షనల్ ఏరియా కూడా సాధారణంగా చిన్నగా ఉంటుంది. దీంతో పుష్–అప్స్, పుల్–అప్స్ వంటి వ్యాయామాలను చేయడం కొంత కష్టంగా అనిపిస్తుంది. శరీర నిర్మాణంలో ఉండే తేడాలు కూడా దీనిపై ప్రభావం చూపుతాయి. మహిళల్లో సాధారణంగా వెడల్పైన పెల్విస్, భిన్నమైన భుజాల నిర్మాణం ఉండటం వల్ల కొన్ని వ్యాయామాల్లో శరీరాన్ని స్థిరంగా ఉంచడం, సరైన లీవరేజ్ పొందడం కాస్త కష్టమవుతుంది. హార్మోన్లు కూడా కండరాల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. మహిళల్లో పురుషులతో పోలిస్తే టెస్టోస్టెరాన్ స్థాయిలు సాధారణంగా చాలా తక్కువగా ఉంటాయి. కండరాల అభివృద్ధి, బలాన్ని పెంచడంలో టెస్టోస్టెరాన్ పాత్ర ఉండటంతో ఈ హార్మోన్ల తేడా కూడా అప్పర్ బాడీ బలంలో వ్యత్యాసానికి ఒక కారణంగా ఉంటుంది. అయితే అప్పర్ బాడీ వ్యాయామాలు మహిళలకు కష్టంగా అనిపించడం అంటే వారు వాటిని చేయలేరని కాదు. సరైన శిక్షణతో క్రమంగా బలాన్ని పెంచుకోవచ్చు. వారానికి రెండు నుంచి మూడు సార్లు అప్పర్ బాడీకి సంబంధించిన వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలకు క్రమమైన శిక్షణ అందుతుంది. దీనివల్ల కాలక్రమేణా కండరాల బలం, పనితీరు మెరుగుపడుతాయి.

తక్కువ బరువుతో ప్రారంభించాలి..బరువులు ఎత్తే విషయంలో కూడా క్రమంగా ప్రతిఘటనను పెంచడం ఉపయోగకరంగా ఉంటుంది. మొదట తక్కువ బరువుతో ప్రారంభించి, శరీరం అలవాటు పడుతున్న కొద్దీ చిన్నచిన్న దశల్లో బరువును పెంచడం ద్వారా కండరాలకు మరింత సవాలు ఇవ్వవచ్చు. తీసుకునే బరువులను నమోదు చేసుకోవడం వల్ల పురోగతిని కూడా సులభంగా గమనించవచ్చు. పుష్–అప్స్, పుల్–అప్స్ వంటి వ్యాయామాలు కష్టంగా అనిపిస్తే వాటి సులభమైన మార్పులను ప్రయత్నించవచ్చు. ఉదాహరణకు.. బ్యాండ్ సహాయంతో పుల్–అప్స్ చేయడం లేదా సాధారణ పుష్–అప్స్‌కు బదులుగా ఇంక్లైన్ పుష్–అప్స్ చేయడం ద్వారా ప్రారంభించవచ్చు. ఇలా క్రమంగా శక్తిని పెంచుకున్న తర్వాత మరింత కష్టమైన వ్యాయామాలకు వెళ్లవచ్చు.ఏమేం వ్యాయామాలు చేయాలి..

ఓవర్‌హెడ్ ప్రెస్, రోస్, చెస్ట్ ప్రెస్ వంటి కాంపౌండ్ చేర్చడం ప్రయోజనకరం.

# మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి సర్వం సిద్ధం

- ఈ నెల 29న రాష్ట్ర మంత్రుల ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్
- హెలిపాడ్, సభా స్థలాల తనిఖీ
- సాగునీటి లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 27 (మన విశ్వం):** అశ్వాపురం మండలం మారెళ్లపాడులో సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 29న రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేశారు. మంత్రుల పర్యటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి బీ.జీ. కొత్తూరు హెలిపాడ్, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం కాలువ ప్రాంతం, గొందిగూడెం--జీ.కొత్తూరు సమీపంలోని సభా స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.హెలిపాడ్ నిర్మాణం, సభా వేదిక, రాకపోకల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలపై అధికా రులతో చర్చించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎత్తిపోతల పథకం పరిధిలో కొనసాగుతున్న పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సీతారామ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియో గంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం అందుబాటులోకి రావడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరు గుపడు తుందని తెలిపారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ కార్యని ర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఉప కార్యనిర్వాహక ఇం జనీర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొ న్నా రు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేం దుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళలదే కీలక పాత్ర

- 'సంఘమిత్ర' అవగాహన సదస్సులో పిలుపు
- 112కు సమాచారం ఇచ్చి యువతను కాపాడాలని సూచన
- జనగామను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
- మహిళా సంఘాల సహకారం అత్యవసరమన్న అధికారులు




**జనగామ, ఆగస్టు 27 (మన విశ్వం):** మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు సమాజాన్ని కూడా మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడే "సంఘమిత్ర"గా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "సంఘమిత్ర -- మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు"లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్వేత మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. పోషకాహారం పంపిణీ, అక్షరాస్యత, కుటుంబ సంక్షేమం, సామాజిక కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. జనగామ జిల్లాలో మహిళల చైతన్యం ప్రత్యేకమని, అదే చైతన్యాన్ని మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో వినియోగించాలని సూచించారు. పరిమిత సంఖ్యలో ఉన్న పోలీసు సిబ్బందికి మహిళా సంఘాల సహకారం ఎంతో అవసరమని అన్నారు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో మాదకద్రవ్యాల వ్యసనం తీవ్ర సమస్యగా మారిన విషయాన్ని ప్రస్తావించిన ఆమె, తెలంగాణలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఇప్పుడే అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారిని డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి మహిళ బాధ్యత అని స్పష్టం చేశారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు మెదడు, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, అవసరమైతే ప్రోత్సాహకాలు కూడా అందజేస్తామని తెలిపారు. పాఠశాల విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు కనిపించినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వారి ద్వారా ప్రతి ఇంటికి మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని చేరవేయవచ్చని చెప్పారు. డ్రగ్స్ కారణంగా కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు, గృహహింస, సామాజిక ఇబ్బందులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి మహిళ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం మొదట సరదాగా ప్రారంభమై చివరకు ప్రాణాంతక వ్యసనంగా మారుతుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలకు కఠిన శిక్షలు, భారీ జరిమానాలు ఉంటాయని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై నిపుణులు అవగాహన కల్పించగా, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సందేశాన్ని అందించారు. కార్యక్రమం ముగింపులో అందరూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఏఎస్‌రావు నగర్‌లో ఆకస్మిక తనిఖీ

- పారిశుధ్య పనులపై కమిషనర్ సమీక్ష
- సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ పరిశీలన
- క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించిన అధికారులు
- సమయపాలనతో పనులు చేయాలని ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 27 (మన విశ్వం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ ఏఎస్‌రావు నగర్, కాప్రా సర్కిల్ పరిధిలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ (డీసీ), డిప్యూటీ ఇంజినీర్ (డీఈ)తో కలిసి పలు ప్రాంతాలను సందర్శించిన కమిషనర్, పారిశుద్ధ్య కార్యకలాపాలు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును సమీక్షించారు. తనిఖీల సందర్భంగా శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ)ల పనితీరును పరిశీలించారు. వారి విధులకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు హాజరు నమోదుపై ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు రికార్డులను పరిశీలించి విధుల్లో క్రమశిక్షణ పాటిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు.అనంతరం క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్య సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారా లేదా అన్న విషయాన్ని ధృవీకరించారు. నిర్ణయించిన పని గంటల్లో సిబ్బంది హాజరై తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించారు. పారిశుద్ధ్య సేవలు నగర పరిశుభ్రతకు కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశిం చారు. హాజరు నమోదులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, సిబ్బంది విధులకు సంబం ధించిన వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్ సిబ్బంది పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పను లు నిర్దేశిత సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నందున వారి పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలు నగర పరిశుభ్రత, పౌర సేవల మెరుగుదలకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# కాగజ్‌నగర్‌లో లిక్కర్ మార్ట్‌లో చోరీ

- నలుగురు దుండగుల కోసం పోలీసుల గాలింపు



**కొమురం భీం,ఆగస్టు 27(మన విశ్వం):** కాగజ్‌నగర్ పట్టణంలో దొంగతనం ఘటన కలకలం రేపింది. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలో ఉన్న త్రినేత్ర లిక్కర్ మార్ట్‌ను దుండగులు లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పరిశీలించగా.. నలుగురు వ్యక్తులు కలిసి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరు షాపు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించగా, మరో ముగ్గురు బయట కాపలాగా ఉన్నట్లు తెలుస్తోంది. షాపులోకి ప్రవేశించిన దుండగుడు గల్లాపెట్టెను ధ్వంసం చేసి అందులోని సుమారు రూ.7 వేల నగదును అపహరించాడు. అంతేకాకుండా రాయల్ రెండు ఫుల్ లిక్కర్ బాటిళ్లను కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. ఉదయం వ్యాపార సముదాయాన్ని తెరిచే సమయంలో షాపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని యజమాని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై సమాచారం అందుకున్న కాగజ్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


**- క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణ:**

చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. దుండగులు వదిలి వెళ్లిన వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. షాపులోని సీసీటీవీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు.

సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చోరీకి పాల్పడిన ముఠాను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# డ్రైవర్ కుటుంబానికి రూ.5 లక్షల భీమా చెక్కు

- ప్రమాదంలో మృతి చెందిన యాకయ్య కుటుంబానికి సాయం
- డ్రైవర్ ప్రమాద భీమా పథకం ద్వారా ఆర్థిక భరోసా
- చెక్కును అందజేసిన జగదీష్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా




**సూర్యాపేట, ఆగస్టు 27 (మన విశ్వం):** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని మద్దిరాల మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొడవళికంటి యాకయ్య కుటుంబానికి డ్రైవర్ ప్రమాద భీమా పథకం కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ అందజేశారు. యాకయ్య ఇటీవల పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టి ఆయనపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. యాకయ్య మృతి కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టిందని నాయకులు పేర్కొన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోవడం వల్ల ఆర్థికంగా, మానసికంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2015లో ప్రవేశపెట్టిన డ్రైవర్ ప్రమాద భీమా పథకం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందడం కొంత భరోసాను కల్పిస్తుందని అన్నారు.

భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం నియోజకవర్గ ఇంచార్జి గౌడిచర్ల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యాకయ్య భార్య కవితకు రూ.5 లక్షల భీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జగదీష్ రెడ్డి, కార్మికులు, డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన పథకాలు అనేక కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ మాట్లాడుతూ, డ్రైవర్ ప్రమాద భీమా పథకం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గతంలో ప్రవేశపెట్టిన పథకాల ప్రాముఖ్యత ఇలాంటి సందర్భాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. బాధిత కుటుంబానికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మద్దిరాల మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.ఏ. రజాక్, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకెపెల్లి రఘునందన్ రెడ్డి, కళ్లేట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని సోమేశ్, దావుల వీరప్రసాద్, బెజ్జంకి శ్రీరాం రెడ్డి, పోలుమల్ల గ్రామ శాఖ అధ్యక్షుడు రేసు వెంకన్న, మండల యూత్ అధ్యక్షుడు నల్ల మధు రెడ్డి, పాతూరి లింగారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ నాయకులు అండగా నిలవాలని స్థానికులు కోరారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన డ్రైవర్ల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించే పథకాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. యాకయ్య కుటుంబం ఈ క్లిష్ట పరిస్థితిని అధిగమించేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పిలుపునిచ్చారు.

5 | మన విశ్వం | VOICE OF THE PEOPLE-POWER OF TRUTH | తెలుగు వార్తా దినపత్రిక | శుక్రవారం, ఆగస్టు 28, 2026



# నేపాల్‌కు భారత్ ఆపన్నహస్తం- 10టన్నుల మానవతా సాయం అందజేత- 300మంది భారతీయులు గల్లంతు

**న్యూ ఢిల్లీ :** నేపాల్‌లోని భోటెకోషి నదీ ప్రాంతంలో సంభవించిన భారీ ఆకస్మిక వరదలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గల్లంతైన భారతీయ పౌరులను గుర్తించి రక్షించేందుకు నేపాల్ ప్రభుత్వంతో కలిసి భారత్ సమన్వయం చేసుకుంటోందని తెలిపింది. వరద ప్రభావిత ప్రాంతాలకు సహాయం ఇప్పటికే చేరడం ప్రారంభమైందని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. మరోవైపు, వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ ఆపన్నహస్తం అందించింది. 10 టన్నుల మానవతా సహాయాన్ని నేపాల్‌కు అందజేసింది."నేపాల్‌లో అకస్మాత్తుగా వరదలు వచ్చినట్లు మాకు సమాచారం అందింది. ఈ వరదల వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో సుమారు 133 మంది భారతీయులు ఉన్నారు. వీరి ఆచూకీ ఇంకా లభించలేదు. భారత జాతీయ సహాయక బృందాలు క్షేత్రస్థాయిలో ఉండి అన్వేషణ, రక్షణ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. వరదల్లో గల్లంతైన వీలైనంత ఎక్కువ మందిని గుర్తించి,



సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని రక్షించడాని కి నేపాల్ ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం."'నేపాల్‌కు అవసరమైన సాయం చేస్తాం'నేపాల్ పట్ల భారత్ చూపిన చురుకైన దౌత్యం, మానవతావాద స్పందనను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాలకు సాయం ఇప్పటికే చేరడం ప్రారంభమైందన్నారు. నేపాల్‌లో ఇలాంటి విపత్తులు ఏర్పడినప్పుడల్లా భారత్ చొరవ తీసుకుని సాయం చేసేందుకు ముందుకొచ్చిందని గుర్తు చేశారు. ఎందుకంటే భారత్‌కు నేపాల్ ఒక స్నేహపూర్వక దేశమని పేర్కొన్నారు. ఇరుదేశాల సమాజాల మధ్య పెద్దగా తేడా లేదన్నారు. రెండు దేశాలు ఎల్లప్పుడూ అన్నదమ్ముల అనుబంధంతో కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఆ బంధం నేటికీ చెక్కుచెదరలేదన్నారు. భారత్ వైపు నుంచి నేపాల్‌కు అవసరమైన సహాయం నిరంతరం అందేలా చూస్తామని చెప్పారు.నేపాల్‌కు అండగా భారత్‌వినాశకరమైన ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ అండగా నిలిచింది. తన ఆపన్నహస్తాన్ని అందించింది. సంక్షోభ సమయంలో పొరుగు దేశానికి అచంచలమైన సంఘీభావాన్ని ప్రకటించింది. నేపాల్‌కు 10 టన్నుల మానవతా సహా యాన్ని అందజేసింది. ఎల్లప్పుడూ నేపాల్‌తో ఉంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది."ఎల్లప్పుడూ నేపాల్‌తోనే ఉంటాం. భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ 10 టన్నుల మానవతా సహాయ సామగ్రిని నేపాల్ సంస్కృతి, పర్యాటక, పౌర విమానయాన శాఖ మంత్రి ఖడ్కా రాజ్ పౌడెల్‌కు అందజేశారు. వినాశకరమైన వరదల అనంతరం చేపట్టిన సహాయక చర్యలకు ఈ సాయం తోడ్పడుతుంది. నేపాల్‌కు భారత్ అండగా అందించడానికి కట్టుబడి ఉంది" అని ఇండియన్ ఎంబసీ పేర్కొంది.

# రామ్‌దేవ్ బాబా నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలా వేలాడుతున్నారా?.

**న్యూ ఢిల్లీ :** యోగాగురువు రామ్‌దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'ఆయన (రామ్‌దేవ్) నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా వేలాడుతున్నారా' అని ప్రశ్నించారు. గతంలో నీట్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులను కంగన విమర్శించిన విషయం తెలిసిందే. నిరసనకారులను జనరేషన్ గట్టర్(అంటే మురికి తరమని అర్థం) అని దూషించారు. అయితే ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆమె సర్వత్రా విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కంగన వ్యాఖ్యలపై రామ్‌దేవ్ బాబా ఘాటుగా స్పందించారు. యువతను జనరేషన్ గట్టర్ అనడానికి ఆమె అర్హతేంటని ప్రశ్నించారు. కంగన జీవితం ఎలాంటిదో అందరికీ తెలుసని మండిపడ్డారు. అలాంటి వారి గురించి మాట్లాడడం తనకు ఇష్టం లేదన్నారు. రామ్‌దేవ్ విమర్శలకు తాజాగా కంగన కౌంటర్ ఇచ్చారు.'నా జీవితం గురించి, నా వ్యక్తిత్వం గురించి రామ్‌దేవ్‌కు ఎలా తెలుసు? ఆయన నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా వేలాడుతూ ఈ విషయాలు గమనిస్తున్నారా?' అంటూ ఆమె సెటైర్లు వేశారు. యోగాగురువు నుంచి వ్యాపారవేత్తగా మారిన ఆయన నా వ్యక్తిత్వం గురించి రామ్‌దేవ్‌కు ఎలా తెలుసు? ఆయన నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా తనకు వ్యక్తిత్వం నేర్పకూడదని ధ్వజమెత్తారు. సనాతన ధర్మంతో మొదలై పక్కా వ్యాపారిగా రామ్‌దేవ్ బాబా మారిపోయారని విమర్శించారు. ఆయుర్వేద మందులు అమ్మే స్థాయి నుంచి లోదుస్తులు అమ్మే స్థాయికి ఆయన వ్యాపారం దిగజారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా గతంలో రామ్‌దేవ్‌కు సంబంధించిన పతంజలి సంస్థపై కంగన కోర్టులో కేసు కూడా వేశారు. ఆ సంస్థ ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొన్నారు.



# జైషే మహ్మద్ కొత్త ఎత్తుగడ.. అజార్ త్యాగం పేరిట యువతకు ఉగ్రవాదం ఎర..!

**న్యూ ఢిల్లీ :** ఆపరేషన్ సింధూర్ తర్వాత జైషే మహ్మద్ అధి నేత మసూద్ అజార్ పేరుతో సాగు తున్న ప్రచా రంపై భారత నిఘా సంస్థలు అప్రమత్తమయ్యా యి. అజార్ ఆరోగ్యం క్షీణించిందన్న ప్రచారం నేపథ్యంలో అతడు బహిరంగంగా కనిపించడం లేదు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ అతడిని అజ్ఞాతం లో ఉంచినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి.అజార్ బయటకు రాకపో యినా అతడి ప్రసంగాలు, తీవ్రవాద భావజా లాన్ని మాత్రం జైషే మహ్మద్ విస్తృతంగా ప్రచా రం చేస్తోంది. యువతను ఆకర్షించేందుకు వాటినే ప్రధాన ఆయుధంగా ఉపయోగిస్తున్నట్లు అధి కారులు చెబుతున్నారు. లష్కరే తోయిబా అధినే త హాఫీజ్ సయీద్, హిజ్బుల్ ముజాహి దీన్ అధినేత సయ్యద్ సలాహుద్దీన్‌తో పోలిస్తే అజార్ ప్రసంగాలకు ఎక్కు ఆదరణ ఉందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి.ఆపరేషన్ సింధూర్ తర్వాత అజార్ పరిస్థితిపై జైష్ కార్యకర్తల్లో అనుమానాలు మొదలయ్యాయి. దాంతో అతడి పాత ప్రసంగాలు, వీడియోలను కొత్తవిగా ప్రచారం చేసినట్లు అధికారులు గుర్తించారు. వాటిపై అనుమానాలు పెరగడంతో తర్వాత వ్యూహాన్ని మార్చారు. అజార్ ఎందుకు అజ్ఞాతంలో



ఉన్నాడో కార్యకర్తలకు వివరించడం మొదలు పెట్టారు. కొత్తగా చేర్చుకునే యువతకు అజార్ ప్రసంగాలను పదేపదే వినిపిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి.అతడి పేరుతో పనిచేయాలని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఆపరేషన్ సింధూర్‌లో అజార్ కుటుంబంలో పలువురు చనిపోయిన విషయాన్ని కూడా ప్రచారానికి ఉపయోగిస్తున్నట్లు వెల్లడించాయి. అజార్ కుటుంబసభ్యుల మరణాలను 'త్యాగం' గా చూపుతూ యువతలో సానుభూతి పెంచుతున్నట్లు తెలిపారు. రెచ్చగొడుతున్నట్లు పేర్కొన్నారు.

# రూ.22వేల కోట్ల బకాయిలకు రూ.6.5కోట్ల చెల్లింపు ఇది హెయిర్ కట్ కాదు, పూర్తి గుండు


వ్యాపారవేత్త, మీడియా రంగ ప్రముఖుడు సుభాశ్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుమారు రూ.22,006.57 కోట్ల మేర రుణదాతల క్లెయిమ్‌లకు కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలిపింది. దీంతో రుణదాతలకు దాదాపు 99.97 శాతం హెయిర్ కట్ తప్పనిసరి కానుండగా, ఆ నిర్ణయంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. సాధారణంగా రుణంలో కొంత మొత్తాన్ని మాత్రమే తిరిగి చెల్లించినప్పుడు మిగిలిన మొత్తాన్ని హెయిర్‌కట్‌గా వ్యవహరిస్తారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే సుభాశ్ చంద్ర కేసులో జరిగినది హెయిర్‌కట్ కాదని, పూర్తిగా శిరోముండనం (గుండు) అని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు."రూ.22 వేల కోట్లకు పైగా క్లెయిమ్‌లు ఉన్నప్పటికీ కేవలం రూ.6.5 కోట్ల చెల్లింపునకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఇది కేవలం జుట్టు కత్తిరించడం కాదు. ఇది నిజానికి పూర్తిగా గుండు చేయడం. ఇన్సాల్వెన్సీ అండ్



బ్యాంక్రప్టసీ కోడ్, 2016ను పూర్తిగా అపహాస్యం చేసే చర్య" అని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. అయితే ఈ విమర్శలపై సుభాశ్ చంద్ర లేదా ఆయన తరపు నుంచి తక్షణ స్పందన వెలువడలేదు.రూ.22 వేల కోట్లకు రూ.6.5 కోట్లుఎన్?సీఎల్?టీ మంగళవారం సుభాశ్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించిన రీపేమెంట్ ప్లాన్‌ను ఆమోదించింది. ఈ ప్రణాళిక ప్రకారం అంగీకరించిన రుణదాతల క్లెయిమ్‌లు సుమారు రూ.22,006.57 కోట్లుగా ఉండగా, వారికి చెల్లించాల్సిన మొత్తం కేవలం రూ.6.5 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో రూ.6.25 కోట్లు రుణదాతలకు, మరో రూ.25 లక్షలు ప్రక్రియకు సంబంధించిన ఖర్చుల కోసం కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్థిక వ్యవహారాల్లో రుణగ్రహీత చెల్లించాల్సిన మొత్తంలో కొంత భాగాన్ని మాత్రమే తిరిగి చెల్లించినప్పుడు మిగిలిన మొత్తాన్ని శాతంగా 'హెయిర్‌కట్'గా పిలుస్తారు. ఈ కేసులో చెల్లింపు మొత్తం చాలా తక్కువగా ఉండటంతో దాదాపు 99.97 శాతం హెయిర్‌కట్ పడినట్లుగా లెక్కిస్తున్నారు.ఇద్దరు సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలుఈ కేసులో ఎన్?సీఎల్?టీకి చెందిన ఇద్దరు సభ్యులు తొలుత భిన్నమైన తీర్పులు ఇచ్చారు. దీంతో అభిప్రాయ భేదాలను పరిష్కరించేందుకు ట్రిబ్యునల్ అధ్యక్షుడు నిలేశ్ శర్మను మూడో సభ్యుడిగా నియమించారు. ఆయన మంగళవారం తీర్పు వెలువరించి రీపేమెంట్ ప్లాన్‌కు ఆమోదం తెలిపారు. ఈ ప్రణాళికపై కొంతమంది రుణదాతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని రుణదాతలు ప్రతిపాదిత చెల్లింపు ఆచరణ సాధ్యం కానిదని, చట్టపరంగా కూడా సమస్యలు ఉన్నాయని వాదించారు. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ అభ్యంతరంఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వుల ప్రకారం, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌కు అంగీకరించిన క్లెయిమ్ మొత్తం సుమారు రూ.1,322.39 కోట్లు. అయితే దానికి ప్రతిపాదించిన చెల్లింపు కేవలం రూ.38,09,294 మాత్రమే. అంటే అంగీకరించిన బకాయిలో సుమారు 0.028 శాతం మాత్రమే తిరిగి చెల్లిస్తున్నట్లు అవుతుందని సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇంత తక్కువ మొత్తాన్ని రుణదాతలు అంగీకరించాల్సి రావడం సరికాదని పేర్కొంది. అంతేకాకుండా రూ.6.5 కోట్ల చెల్లింపు కూడా ప్రణాళికలో నిశ్చయాత్మకంగా కాకుండా సూచనాత్మకంగా మాత్రమే పేర్కొన్నారని రుణదాతలు వాదించారు. అందువల్ల ఈ ప్రణాళిక తాత్కాలికమైనదని, నిశ్చయాత్మకత లేనందున ఆమోదించకూడదని కోరారు.80.81 శాతం ఓట్లతో ఆమోదంఅభ్యంతరాలు ఉన్నప్పటికీ రీపేమెంట్ ప్లాన్‌కు అవసరమైన ఓటింగ్ మద్దతు లభించిందని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది.


# ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్.. యువ అథ్లెట్లతో ప్రధాని వర్చువల్ ఇంటరాక్షన్

**న్యూ ఢిల్లీ :** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్(డైలాగ్) కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు.దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాసక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు.ఒలింపిక్స్‌లో భారత్ తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అథ్లెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు.ఖేలో ఇడియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణడిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు.



# ముంబైలో మరో భారీ వంతెన.. 90 నిమిషాల జర్నీ ఇక 10 నిమిషాల్లోనే..!

**ముంబై :** మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదాచేసే మరో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. నగరంలోని వెర్సోవా , మధ్ ఐలాండ్ ప్రాంతాలను కలుపుతూ మలాడ్ క్రీక్ పై రూ.2,395 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక కేబుల్ ఆధారిత వంతెన (కేబుల్-స్టేయ్డ్ బ్రిడ్జ్) నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.ఈ వంతెన అందుబాటులోకి వస్తే ప్రస్తుతం 60 నుంచి 90 నిమిషాలు పట్టే ప్రయాణానికి ఇక కేవలం 10 నిమిషాలే పడుతుంది. ప్రస్తుతం వెర్సోవా, మధ్ ఐలాండ్ మధ్య ప్రత్యక్ష రోడ్డు కనెక్టివిటీ లేదు. మలాడ్ క్రీక్ ఈ రెండు ప్రాంతాలను వేరు చేస్తోంది. దాంతో రోడ్డు మార్గంలో ప్రయాణించాలంటే సుమారు 18 నుంచి 20 కిలోమీటర్ల దూరం.. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్‌ను బట్టి ఈ ప్రయాణానికి గంట నుంచి గంటన్నర సమయం పడుతోంది. ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణికుల కోసం జెట్టీ సర్వీసు అందుబాటులో ఉన్నప్పటికీ, అది పూర్తిస్థాయి పరిష్కారం చూపడం లేదు.ఈ జెట్టీ సర్వీసు ఏడాదిలో కేవలం ఎనిమిది నెలలు మాత్రమే పనిచేస్తుంది. వర్షాకాలంలో భద్రతా కారణాల దృష్ట్యా దీనిని నిలిపివేస్తారు. పరిమిత వేళల్లో మాత్రమే నడిచే ఈ సర్వీసు రోజువారీ ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోతున్నది.



# ఉక్రెయిన్ షాపింగ్ మాల్‌పై అటాక్‌లో 16 మంది మృతి.



**కీవ్:** ఉక్రెయిన్ షాపింగ్ సెంటర్‌పై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఆ శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. ఈ ఘటనలో 16 మంది మృతిచెందగా, 130 మంది గాయపడ్డారు. కిరివి రిహ్‌లో ఉన్న షాషింగ్ మాల్‌పై శుక్రవారం దాడి జరిగింది. 9 మంది మిస్సింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆ దాడి గురించి స్పందించారు. రెండు దశల్లో అటాక్ జరిగినట్లు చెప్పారు. ఎమర్జెన్సీ వర్కర్లను టార్గెట్ చేస్తూ రెండోసారి డ్రోన్ దాడి జరిగింది. ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేర్‌హౌజ్‌లను టార్గెట్ చేసిన రష్యా రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొన్నది. దినిప్రపెట్రోస్క్ ప్రాంతంలోని షాపింగ్ సెంటర్‌పై జరిగిన దాడిలో 13 మంది గాయపడినట్లు తెలిసింది.

# కుప్పకూలిన శిక్షణ విమానం- ఇన్‌స్ట్రక్టర్, ట్రైనీ పైలెట్ దుర్మరణం

**ఉత్తర్‌ప్రదేశ్ :** కాన్పూర్‌లోని గంగానది తీరంలో ఓ శిక్షణ విమానం కుప్పకూలగా, ఇన్‌స్ట్రక్టర్‌తో పాటు ఓ ట్రైనీ పైలెట్ ప్రాణాలు కోల్పోయారు. గార్గ్ ఏవియేషన్‌కు చెందిన రెండు ఇంజిన్లు కలిగిన 'టెక్నామ్' శిక్షణ విమానం గురువారం ఉదయం 11.30 గంటలకు కాన్పూర్‌లో టేకాఫ్ అయింది. గాల్లోకి ఎగిరిన 20 నిమిషాలకే కత్రి ప్రాంతంలోని నాథపుర్వా గ్రామం వద్ద గంగానది ఒడ్డున అదుపుతప్పి కుప్పకూలింది.ప్రమాద ధాటికి నుజ్జునుజ్జు అయిన విమానంఈ ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన ఇన్‌స్ట్రక్టర్ సచిన్ భాటియా, కర్ణాటకకు చెందిన ట్రైనీ పైలెట్ అభిషేక్ పూజారి మృతి చెందారు. మరణించిన ఇన్‌స్ట్రక్టర్ సచిన్ భాటియాకు దాదాపు 3000 గంటల పాటు విమానం నడిపిన అనుభవం ఉందని కాన్పూర్ పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదం ధాటికి విమానం



పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఘటనా స్థలానికి చేరుకుని శకలాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద తీరును బట్టి విమానం ఏదైనా వస్తువును ఢీకొన్నట్లు తెలుస్తోందని, అయితే సమగ్ర విచారణ తర్వాతే కచ్చితమైన కారణం తెలుస్తుందని పోలీసు అధికారులు తెలిపారు.ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న శకలాలుప్రమాద స్థలం నుంచి వచ్చిన వీడియోల్లో ఆ ప్రాంతమంతా శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు కనిపించింది. ప్రమాద సమయంలో పెద్ద పెద్ద శబ్దాలు వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. భారీ శబ్దాలతో మొదట బాంబు పేలిందేమోనని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని తెలిపారు. ప్రమాద సమయంలో పైలట్లు విమా నం నుంచి బయటకు రావడానికి ప్రయ త్నించారా లేదా అనే విషయాన్ని అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు, ప్రమాదానికి గురైన విమానం 2023 నుంచి గార్గ్ ఏవియేషన్ యాజమాన్యంలో ఉంది. అయితే, ఈ విమానంలో నిర్వహణకు సంబంధించిన ఎలాంటి లోపాలు లేవని ఆ సంస్థ పేర్కొంది. ప్రమాదం జరిగిన అనంతరం కమిషనర్ లాల్, అదనపు పోలీస్ కమిషనర్లు విపిన్ తాడా, సంకల్ప్ శర్మ, చీఫ్ ఫైర్ ఆఫీసర్ దీపక్ శర్మ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.ఇదిలా ఉండగా, విమాన ప్రమాద ఘటనపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించింది. "ఎయిర్‌పోర్ట్‌కు సుమారు 5 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. ఐ-చీడీఏ రిజిస్ట్రేషన్ గల టెక్నామ్ ౹ా2006ు విమానం గురువారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. ఈ విమానాన్ని కాన్పూర్‌కు చెందిన గార్గ్ ఏవియేషన్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఈ విమానం కాన్పూర్ సివిల్ ఎయిర్‌పోర్ట్‌లోని లోకల్ ఫ్లయింగ్ ఏరియాలో శిక్షణా విమానయానంలో పనిచేస్తోంది. విమానంలో శిక్షణ పొందుతున్న పైలట్, శిక్షకుడు ఉన్నారు.

## దేశంలో క్రీడలకు కొత్త దిశ చూపిన ఘనత ప్రధాని మోదీది



**అమరావతి, ఆగస్టు 27** దేశంలో క్రీడలకు కొత్త దిశ చూపిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2014 తర్వాత క్రీడారంగంలో వ్యవస్థీకృత సంస్కరణలు జరిగాయని వివరించారు. ప్రతిభ గుర్తింపు, యాంటీ డోపింగ్ చట్టాలతో క్రీడలకు ఊతం లభించినట్లు అయిందన్నారు. గుంటూరులో రూ.14 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. క్రీడా బడ్జెట్‌లో కేటాయింపులు రూ.2 వేల నుంచి రూ.4 వేల కోట్లకుపైగా పెంచినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రూ.25 వేల కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. ఒలింపిక్ స్థాయి శిక్షణా కేంద్రాల ఏర్పాటే కేంద్ర ప్రభుత్వ విజన్‌కు నిదర్శనమని అన్నారు. 2030 కామన్వెల్త్, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఆత్మవిశ్వాసమే కారణమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

# చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ తీవ్ర విచారం

**అమరావతి, ఆగస్టు 27:** పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాల అండ: పల్లా శ్రీనివాసరావుచిలకలూరిపేట సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు




తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏడుగురి మృతి కలచివేసింది: ప్రత్తిపాటి పుల్లారావుచిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు.

## నేపాల్ వరదలపై అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం - ఏపీ యాత్రికుల ఆచూకీపై ఆరా

**అమరావతి, ఆగస్టు 27** హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. నేపాల్, టిబెట్ సరిహ ద్దులోని భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. గ్రామాలు, పట్టణాలు జల సమాధి అయ్యాయి. వరద దెబ్బకు ఆ దేశంలోని భవనాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. దాదాపు డజను కుపై గా జల విద్యుత్ కేంద్రాలు తీవ్రంగా దెబ్బతి న్నాయి. దీంతో నేపాల్‌లో అంధకారం నెలకొం ది. ఈ ఘటనలో పలువురు గల్లంత య్యారు. వీరిలో భారతీయులతో పాటు విదేశీయులు కూడా ఉన్నారు. మరికొంత మంది మరణిం చారు. గల్లంతైన వారి కోసం బంధువులు ఆందోళన చెందుతున్నారు. క్షణాల్లోనే పలు ప్రాంతాల రూపు రేఖలు మార్చేసిన భీకర వరద అనంతరం సహాయ చర్యలు కొనసాగుతున్నాం ఱ. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్? ప్రభుత్వం అప్రత్తమైంది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో నేపాల్‌లో భారీ వర్షాలు, వరదల్లో చిక్కుకున్న తెలుగు వారి క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తోంది. మానస సరోవర యాత్రకు వెళ్లిన వారిలో తెలుగు వారు, ప్రత్యేకంగా ఏపీకి చెందిన యాత్రికులు ఎవరైనా




ఉన్నారా అనే వివరాలను ఆర్టీజీఎస్ అధికారులు వివిధ మార్గాల్లో ఆరా తీస్తున్నారు. ఈ మేరకు యాత్రలను నిర్వహించే టూరిస్ట్ సంస్థలు, ట్రావెల్ ఏజెన్సీలతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.: ఈ నేపథ్యంలోనే తిరుపతికి చెందిన 28 మంది యాత్రికులతో కూడిన బృం దం ప్రస్తుతం కాఠ్‌మాండూలో ఉన్నట్లు ఆర్టీ జీఎస్ గుర్తించింది. వారు అక్కడి యెల్లకొండ ప్రాంతంలోని ఓ హోటల్‌లో యాత్రికులు బస చేస్తున్నట్లు నిర్ధారించింది. ఈ క్రమంలో అధికా రులు వారితో మాట్లాడి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. తామంతా సురక్షితంగానే ఉన్నామని యాత్రికులు అధికారులకు తెలిపారు. ఎలాంటి సహాయం అవసరమైనా వెంటనే తమను సంప్రదించాలని ఆర్టీజీఎస్ అధికారులు యాత్రికులకు సూచించారు. తమ క్షేమ సమాచారాన్ని తెలుసుకునేందుకు అధికారులు సంప్రదించినందుకు యాత్రికులు ధన్యవాదాలు తెలిపారు. నేపాల్‌లో మళ్లీ ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో యాత్రికులు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని అధికారులు సూచించారు. నేపాల్‌లో తాము క్షేమమేనన్న విశాఖ వాసులు : మరోవైపు మానసరోవర యాత్రకు విశాఖ నుంచి నేపాల్ వెళ్లినవారు సురక్షితంగా ఉన్నారు. వీరి ముందు వెళ్తున్న రెండు బస్సులు ప్రవాహంలో కొట్టుకుపోయాయని నగర వాసులు తెలిపారు. 50 మీటర్ల దూరంలో జరిగిన ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసి తీవ్రంగా భయపడ్డామని చెప్పారు. తమ బస్సు వంతెనకు సమీపంగా చేరుకునేసరికి ఎదురుగా వచ్చిన మరో బస్సు డ్రైవరు అటు వెళ్లొద్దని పెద్దగా కేకలు వేయడంతో ఆగిపోయి ప్రమాదం నుంచి బయటపడినట్లు వివరించారు. బస్సులో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు, విశాఖ డీఎల్‌డీఏ ఛైర్మన్ గాడు వెంకటప్పడు, సింగనబంద మాజీ సర్పంచి గాడు వెంకట నారాయణ ఉన్నారు. వీరితోపాటు విశాఖలోని వివిధ ప్రాంతాలకు చెందిన 26మంది సురక్షితంగా ఉన్నారు. మరోవైపు కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన భాస్కరశాస్త్రి కుటుంబం కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్ వరదల కారణంగా చైనాలోని డార్చింగ్ ప్రాంతంలో చిక్కుకుంది. ఈ నెల 10న భాస్కరశాస్త్రి, ఆయన సతీమణి శారద, కుమారుడు రఘునాథశాస్త్రి, కోడలు హస్నిక బెంగళూరు నుంచి కైలాస మానసరోవర్ యాత్రకు బయలుదేరారు. అక్కడినుంచి ఇతర ప్రాంతాలకు విదేశాంగశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించానని చెప్పారు. అక్కడ నిర్ణయం వెలువడగానే వారికి సమాచారం చెబుతానని వివరించారు.

## క్యాడర్ చేజారిపోకుండా ఉండేందుకే ఊహాజనిత వ్యాఖ్యలు.



**అమరావతి, ఆగస్టు 27:** మాజీ సీఎం జగన్ వ్యవహార శైలితో వైసీపీ నాయకులతో పాటు క్యాడర్ కూడా విసిగిపోయి ఉన్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. క్యాడర్ చేజారకుండా ఉండేందుకే వారి తృప్తి కోసం జగన్ కొన్ని ఊహాజనిత కామెంట్లు చేస్తున్నారని విమర్శించారు. బెంగళూరులో చల్లదనం వల్ల నిన్నటి వరకూ జగన్‌కు ఎల్‌నినో ప్రభావం తెలియలేదా అంటూ సెటైర్ విసిరారు. ఎక్కువ కాలం బెంగళూరులో ఉంటున్నందున రాష్ట్ర పరిస్థితులపై జగన్ అవగాహన కోల్పోతున్నారన్నారు. శంకుస్థాపన చేసిన స్టీల్ ప్లాంట్‌కే మళ్లీ మళ్లీ శంకుస్థాపన చేయటం తప్ప రాయలసీమకు వైసీపీ అధినేత ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. విధ్వంసంతో 5 ఏళ్ల పాలన జగన్ సాగిస్తే, పునర్నిర్మాణంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిషేధిత సంస్థల మాదిరి జగన్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం 5 ఏళ్లలో పోలవరం పూర్తి చేసి ఉంటే, ఎల్‌నినో ప్రభావం ఇంత ఉండేది కాదన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు వదలటాన్ని తప్పుపడుతున్న వైసీపీ నేతలు రైతు వ్యతిరేకులమని చాటుకుంటున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

## మంగళగిరికి అమరావతి నుంచే తాగునీరు

**అమరావతి, ఆగస్టు27:** మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను మంత్రి నారాయణ వివరించారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ



భూసమీకరణ రైతులకు కూడా రుణ మాఫీ వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు.

# కరవుపై డ్రామాలు ఆపి వాస్తవాలు చూడండి:

**అమరావతి, ఆగస్టు 27:** రాయలసీమలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను అడ్డం పెట్టుకుని వైసీపీ అధినేత జగన్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తీవ్రంగా విమ ర్శించారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమా వేశంలో మాట్లాడారు. సీమ ప్రయోజనాలను ఏనాడూ పట్టించుకోని జగన్, ఇప్పుడు కరవుపై డ్రామాలు ఆడుతున్నారని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు. తమ ఐదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు జగన్ ప్రభుత్వం కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని కాల్వ ఆరోపించారు. మరోవైపు, 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చు చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రూ.13,500 కోట్లకు పైగా ఖర్చు చేసిందని వివరించారు. ఈ బడ్జెట్‌లో మరో



రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు. గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 365 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 198 ప్రాజెక్టులను ప్రీ-క్లోజర్ చేస్తే, అందులో 102 ప్రాజెక్టులు ఒక్క రాయలసీమలోనే ఉన్నాయని కాల్వ శ్రీనివాసులు గుర్తుచేశారు. హంద్రీనీవా విస్తరణ, వేదవతి, గుండ్రేవులు, హెచ్‌ఎల్‌సీ కాలువ ఆధునికీకరణ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేసి జగన్ రాయలసీమకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హంద్రీనీవాకు ఇప్పటికే రూ.3,850 కోట్లు ఖర్చు చేసిందని, ఈ ఏడాది మరో రూ.1,180 కోట్లు కేటాయించామని తెలిపారు. జగన్ రద్దు చేసిన మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులను తిరిగి ప్రారంభించామని స్పష్టం చేశారు. ప్రస్తుత కరవు ప్రపంచవ్యాప్త సమస్య అని, ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని 12 రాష్ట్రాల్లోని 315 జిల్లాల్లో తీవ్ర పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కృష్ణా జలాల విషయంలోనూ జగన్ ద్వంద్వ వైఖరి అవలం బిస్తున్నారని, 'తెలంగాణ నీళ్లు తోడేస్తుంటే బాబు మౌనం' అని సాక్షిలో, 'కృష్ణా జలాల్లో ఏపీ దోపిడి' అని నమస్తే తెలంగాణలో పరస్పర విరుద్ధ కథనాలతో ప్రాంతాల మధ్య చిచ్చుపెడు తున్నారని ఆరోపించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిబంధనల ప్రకారమే నీటి కేటాయింపులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు సమర్థ నీటి నిర్వహణ వల్లే గత ఏడాది నీటిని నిల్వ చేసుకుని ఈరోజు కొంత వెసులుబాటు కలిగిందని, 2027 జూలై వరకు తాగునీటి అవసరాలకు నీటిని నిల్వ చేస్తున్నామని తెలిపారు. ఈ కష్టకాలంలో రాజకీయాలు మాని, రైతులకు, ప్రజలకు అండగా నిలవాలని జగన్‌కు హితవు పలికారు.

## ఏపీ లిక్కర్ స్కామ్.. సిట్, ఈడీ అధికారులతో ఐటీ అధికారుల కీలక సమావేశం!

**అమరావతి, ఆగస్టు 27:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగడంతో దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. ఈ కుంభకోణంలో అక్రమంగా కొల్లగొట్టిన నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. మనీ ట్రయల్‌కు సంబంధిం చిన కీలక వివరాలను సేకరించేందుకు హైదరా బాద్ వేదికగా సిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులతో ఐటీ ఉన్నతాధికారులు సమా వేశమయ్యారు. షెల్ కంపెనీలను సృష్టించి కోట్లాది రూపాయల




నగదును విదేశాలకు మళ్లి ంచినట్లు దర్యాప్తు అధికారులు ఇదివరకే గుర్తిం చారు. ముఖ్యంగా దుబాయ్ సహా పలు ఇతర దేశాలకు, బినామీ కంపెనీలకు ఈ సొత్తును తరలించినట్లు తేలడంతో... ఆయా కంపెనీల నెట్‌వర్క్, వాటి వెనుక ఉన్న అసలు సూత్రధా రులపై ఐటీ దృష్టి సారించింది. అసలు, నిధులు ఏ ఏ ఖాతాల గుండా ఎక్కడికి చేరాయి, విదేశీ ఖాతాలకు, బినామీ సంస్థలకు సొమ్మును ఏ రూపంలో తరలించారనే అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఈ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా ప్రధాన నిందితులు, డొల్ల కంపెనీల జాబితా, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల వివరాలను ఐటీ అధికారులు తీసుకున్నారు. ఈ కుంభకోణంతో పరోక్షంగా ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలకు సహకరించిన శక్తుల సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. సిట్, ఈడీ అందించిన ఆధారాలు, నివేదికల ఆధారంగా త్వరలోనే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు, దాడులకు ఆదాయపు పన్ను శాఖ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## అమరావతిలో ఆక్టేవ్, వీఐటీ-ఏపీ మధ్య అవగాహన ఒప్పందం

**అమరావతి, ఆగస్టు 27:** అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ఆక్టేవ్ సంస్థ మధ్య రెండేళ్ల అవగాహన ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మిషన్ లెర్నింగ్ , సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణను అందించడమే ఈ భాగస్వామ్య ప్రధాన ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగా ఆక్టేవ్‌కు చెందిన మెంటర్లతో కలిసి విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించనున్నారు. ప్రతి ప్రాజెక్టులో ఒక ప్రొఫెసర్‌తో పాటు నలుగురు విద్యార్థులు, ఇద్దరు మెంటర్లు ఉండనున్నారు. ప్రతి ప్రాజెక్టును మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా ప్రణాళికను రూపొందించారు. అలాగే ూ×, మీకు సంబంధించిన పాఠ్యాంశాలపై వీఐటీ-ఏపీకి ఆక్టేవ్ సంస్థ సూచనలను అందించనుంది. విద్యార్థుల నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు హ్యాకథాన్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, కెరీర్ అవకాశాలకూ ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడమే ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# కొత్త గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా డ్రీమ్11




డ్రీమ్11 కొత్త దారిలోకి అడుగుపెట్టింది. రియల్ మనీ గేమింగ్, నగదు బహుమతులతో కూడిన ఫాంటసీ స్పోర్ట్స్ కాంటెస్టులను ఆపేసిన ఏడాది తర్వాత, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను కలిపే ప్లాట్‌ఫామ్‌గా మారిందని పీటీఐ వెల్లడించింది. ఇకపై డ్రీమ్11లో ప్రైజ్ మనీ ఉండదు. స్పోర్ట్స్ కంటెంట్, లైవ్ స్ట్రీమింగ్, స్కోర్లు, స్టాట్స్, కమ్యూనిటీ ఫీచర్లు, స్పోర్ట్స్ అనుభవాలు, సోషల్ కాంటెస్టులపై సంస్థ దృష్టి పెట్టనుంది. గురువారం డ్రీమ్11 ఈ మార్పును ప్రకటించింది. ఇంతకాలం ఫాంటసీ స్పోర్ట్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన ప్లాట్‌ఫామ్, ఇప్పుడు గ్లోబల్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా మారింది.కొత్త ప్లాట్‌ఫామ్‌లో ఏఐకి ప్రధాన పాత్ర ఉండనుంది. యూజర్లు ఇష్టపడే స్పోర్ట్స్, లీగ్‌లు, టీమ్‌లు, ప్లేయర్ల ఆధారంగా వారికి నచ్చే కంటెంట్, అనుభవాలను వ్యక్తిగతంగా అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను ఒక కమ్యూనిటీగా కలపడం ద్వారా 'మేక్ స్పోర్ట్స్ బెటర్' అనే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని డ్రీమ్11 చెబుతోంది. కొత్త డ్రీమ్11లో ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు రకాల స్పోర్ట్స్ అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నారు. యూజర్లు లైవ్ మ్యాచ్‌లు చూడొచ్చు. గత వారాంతంలో జరిగిన రేస్‌ను ఫాలో అవ్వొచ్చు. స్టాటిస్టిక్స్, కామెంటరీ చూడొచ్చు. స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రత్యేక అనుభవాలను బుక్ చేసుకోవచ్చు. స్నేహితులు, ఇతర స్పోర్ట్స్ అభిమానులతో కలిసి సోషల్ కాంటెస్టుల్లో పాల్గొనొచ్చు.డ్రీమ్11 సీఈఓ వైభవ్ కోకల్ మాట్లాడుతూ, తమ 30 కోట్ల మంది యూజర్లతో పనిచేసిన అనుభవం ద్వారా స్పోర్ట్స్ అభిమానులు కేవలం ఆటను మాత్రమే కోరుకోవడం లేదని చెప్పారు. వాళ్లు ఒక కమ్యూనిటీలో భాగంగా ఉండాలని కూడా కోరుకుంటున్నారని తెలిపారు. "దేశంలోని అత్యుత్తమ టెక్ టాలెంట్ మద్దతుతో, ఇండియాలో తయారై ప్రపంచం కోసం రూపొందించిన ఏఐ-ఫస్ట్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని ఆయన చెప్పారు. గత ఏడాది ఆగస్టులో పార్లమెంట్ 'ప్రొమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025'ను ఆమోదించిన తర్వాత డ్రీమ్11 తన రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత ప్లాట్‌ఫామ్‌లో డబ్బులు చెల్లించి ఆడే కాంటెస్టులన్నింటినీ ఆపేసింది. కొత్త చట్టానికి అనుగుణంగా ఉచితంగా ఆడే సోషల్ గేమింగ్ మోడల్‌కు మారింది. మొత్తంగా చూస్తే, డ్రీమ్11 ఇకపై డబ్బులు గెలుచుకునే ఫాంటసీ స్పోర్ట్స్ యాప్‌గా కాకుండా, లైవ్ స్పోర్ట్స్, కంటెంట్, స్టాట్స్, కమ్యూనిటీ, సోషల్ కాంటెస్టులు, స్పోర్ట్స్ అనుభవాలను ఒకే చోట అందించే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా తన కొత్త ప్రయాణాన్ని కొనసాగించనుంది.

# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా



వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

# రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం

**శ్రీలంక ఆటగాడు సోనాల్ దినుషా అజేయ శతకం**

**శ్రీలంకతో డ్రాగా ముగిసిన రెండో టెస్ట్**

**టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం**




శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు. తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు.

32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిభిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది.ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.




## రవీంద్ర జడేజా చెత్త రికార్డ్..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ కాలంలో అత్యధిక నోబాల్స్ వేసిన ఆటగాడిగా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో జడేజా 88 నోబాల్స్ వేసాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో జడేజా మొత్తం నాలుగు నోబాల్స్ వేసాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో ఒకటి వేసాడు. తొలి టెస్ట్‌లోనూ జడేజా నాలుగునో బాల్స్ వేసాడు. ఇన్నింగ్స్‌కు రెండు చొప్పున నోబాల్స్ సంధించాడు. ఇందులో ఒకటి ధనంజయ డి సిల్వాకు లైఫ్‌లైన్‌గా మారింది. దాంతో టెస్టు క్రికెట్‌లో ఒక స్పిన్నర్ అత్యధిక నో బాల్స్ వేసిన చెత్త రికార్డును జడేజా మూటగట్టుకున్నాడు. జడేజా తర్వాత రెండో స్థానంలో పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ ఉన్నాడు.రెండో టెస్ట్‌లో జడేజాతో సహా భారత బౌలర్లంతా 10 నోబాల్స్ వేసారు. అఫ్గానిస్థాన్(14) తర్వాత అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా భారత జట్టు అప్రతిష్టను మూటగట్టుకుంది.ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు.తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది.

# అఫ్గాన్‌తో టి20 సిరీస్‌కు అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది.భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.






# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది.'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# రంగస్థలంను మించి

## మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ



టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.

## రకుల్ నోట శూర్పణఖ కథ.. తెలియని విషయాలు బయటపెట్టిన నటి!



రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది.రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది.రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్–1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నటుడు నారాయణరావు కన్నుమూత



ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.

-----------------

## రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు




రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569